# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :182 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 19-09-2024 | పేజీలు:4 వెల: 2.00


### డిసెంబర్ 1న సీటెట్ ఎగ్జామ్...

హైదరాబాద్, ఉపాధ్యాయ, ఉద్యోగార్థులకు నిర్వహించే సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్(సీటెట్) నోటిఫికేషన్ విడుదలైంది. డిసెంబర్ 1న ఉదయం పేపర్ -2, మధ్యాహ్నం పేపర్ -1 పరీక్షను నిర్వహించనున్నట్టు సీబీఎస్ఈ ప్రకటించింది.దరఖాస్తులు అధికంగా వస్తే నవంబర్ 30న సైతం పరీక్షను నిర్వహిస్తామని వెల్లడించింది. రంగల్, హైదరాబాద్‌లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.దరఖాస్తుల స్వీకరణ మంగళవారం నుంచే ప్రారంభంకాగా, అక్టోబర్ 16వరకు గడువు ఉంది.

కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్స్

హైదరాబాద్,కార్మికుల పిల్లలకు అందజేసే స్కాలర్‌షిప్స్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కేంద్ర కార్మికశాఖ అసిస్టెంట్ వెల్ఫేర్ కమిషనర్ అభినవ్ తివారి ప్రకటనలో తెలిపారు. బీడీకార్మికులు, లైమ్‌స్టోన్, డోలమైట్ మైన్, మైకా, ఇనుపఖనిజం గనుల్లో పనిచేసే కార్మికులు, సినీ కార్మికుల పిల్లలు స్కాలర్‌షిప్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రీ మెట్రిక్ (1-10తరగతులు) వారు 30లోపు, పోస్ట్‌మెట్రిక్ (11వ తరగతి నుంచి డిగ్రీ,

## ప్రజాస్వామ్య పండుగను బలోపేతం చేయండి..



జమ్మూ :దాదాపు పదేళ్ల తర్వాత జమ్మూ కశ్మీర్‌లో ఎన్నికలు జరుగుతున్నాయి. జమ్మూ అసెంబ్లీకి తొలి విడత పోలింగ్ బుధవారం ఉదయం ప్రారంభమైంది. మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలకు గానూ.. తొలి దశలో 24 స్థానాల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. ఈ పోలింగ్ నేపథ్యంలో ఓటర్లుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కీలక విజ్ఞప్తి చేశారు.జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశ పోలింగ్ ప్రారంభమైందని, ఈరోజు పోలింగ్ జరుగుతున్న అన్ని నియోజకవ ర్గాల్లో అధిక సంఖ్యలో ప్రజలు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ప్రజా స్వామ్య పండుగను బలోపేతం చేయాలని కోరారు. ప్రత్యేకించి యువతీ యువకులు, మొదటిసారి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ పెట్టారు.కాగా, ఏడు జిల్లాల పరిధిలోని 24 అసెంబ్లీ స్థానాల్లో 219 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 23 లక్షల మంది ఓటర్లు తొలి విడుతలో ఓటు హక్కు వినియోగించుకో నున్నారు. మరాజ్ రీజియన్‌లోని అనంత్ నాగ్, పుల్వామా, కుల్గాం, షోపియాన్ జిల్లాలు, చీనాబ్ లోయలోని డోడా, కిశ్త్ వాద్, రాంబన్ జిల్లాల్లో పోలింగ్ కొనసాగుతోంది. పాంపోర్, త్రాల్, పుల్వామా, రాజ్‌పుర, జైనాపుర, షోపియాన్, డీహెచ్ పుర, కుల్గాం, దేవ్‌సర్, దూరు, కోకెర్‌నాగ్, అనంత్ నాగ్ వెస్ట్, అనంత్ నాగ్, శ్రీగుఫ్వారా %-% బిజ్‌బెహరా నియోజకవర్గాలు కీలకంగా ఉన్నాయి. బీజేపీ, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ), పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ(పీడీపీ) ప్రధానంగా పోటీ పడుతున్నాయి. ఎన్‌సీతో కాంగ్రెస్ పొత్తులో ఉంది.

## హైదరాబాద్‌లో ప్రశాంతంగా గణేశ నిమజ్జనం...

హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరంలో గణేశ్ నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. గతంలో కంటే ఈ ఏడాది మూడు గంటల ముందే నిమజ్జన ప్రక్రియ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. నిమజ్జనానికి సహకరించిన ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ సమితితో పాటు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు చెప్పారు. ట్రాఫిక్ దృష్ట్యా బుధవారం ఉదయం 10:30 గంటలకే అన్ని జంక్షన్లను, ఫ్లై ఓవర్లను తెరిచామని తెలిపారు.అయితే గణేశ్ నిమజ్జన ప్రక్రియ బుధవారం ఉదయం 7 గంటల వరకు ముగిసేలా ప్లాన్ చేశామని సీపీ తెలిపారు. కానీ కొన్ని మండపాల నిర్వాహకులు సహకరించకపోవడం వల్ల ఆలస్యం జరిగిందన్నారు. వచ్చే ఏడాది ముందే మండపాల నిర్వాహకులతో సమావేశమై.. సమయానికి నిమజ్జనం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈసారి చాలా వాహనాలు ఫెయిల్ కావడం, భారీ గణనాథులకు విద్యుత్ తీగలు అడ్డు తగలడం వంటి కారణాలతో కూడా నిమజ్జన ప్రక్రియ ఆలస్యమైందన్నారు.గత పది రోజుల నుంచి హుస్సేన్ సాగర్‌లో లక్షకు పైగా గణనాథులను నిమజ్జనం



చేసినట్లు పేర్కొన్నారు. నిన్న ఒక్కరోజే సుమారు 20 వేలదాకా నిమజ్జనం చేసినట్లు తెలిపారు. ఇక నిమజ్జన ప్రక్రియ బందోబస్తుకు 25 వేల మంది విధుల్లో ఉన్నారని తెలిపారు. ఇందులో సిటీ నుంచే 15 వేల మంది పోలీసులు ఉన్నారని సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

## ప్రభుత్వానికి ధరణి కమిటీ కీలక సూచనలు

హైదరాబాద్,ధరణి పోర్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా రేవంత్ సర్కార్ ముందడుగులు వేస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాలతో మాట్లాడిన ధరణి కమిటీ తుది నివేదికను సైతం రూపొందించింది. అయితే తాజాగా కమిటీ ప్రభుత్వానికి పలు సూచనలు చేసింది. 2020 సెప్టెంబర్‌లో ధరణిని ప్రారంభించినప్పటి నుంచి అందులో ఏమైనా అనాధికారిక మార్పులు జరిగాయా ? లేదా ? అని తనిఖీ చేసేందుకు పోర్టల్‌కు సంబంధించి థర్డ్ పార్టీ ఆడిట్‌ను పరిగణలోకి తీసుకోవాలని కోరింది. అయితే ధరణి పోర్టల్‌లో స్థలాల యజమానుల పేర్లను, సర్వే నెంబర్లను, భూమి విస్తరణను మార్చడం.. అలాగే పలు సర్వే నెంబర్లను నిషేధిత జాబితాలో పెట్టడం, తప్పులు నమోదు చేయడం లాంటి అనాధికార మార్పులు జరిగాయని ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే వీటిని పరిశీలించేందుకు కమిటీ.. మూడో పార్టీ ఆడిట్‌ను తీసుకోవాలని రేవంత్ సర్కార్‌కు విజ్ఞప్తి చేసింది. అంతేకాదు ప్రభుత్వ డేటాను కాపాడటం, ప్రజల ప్రైవసీ సమస్యలను పరిష్కరించడం కోసం ధరణి పోర్టల్‌ను నియంత్రించే బాధ్యతను నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ , సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్, లేదా టీఎస్ఆన్‌లైన్ లాంటి ప్రభుత్వ సంస్థలకు అప్పగించాలని సూచించింది.కొన్ని నెలల క్రితమే రాష్ట్ర ప్రభుత్వం.. రైతు కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండ రెడ్డి, భూములు నిపుణుడు ఎం. సునిల్ కుమార్ తదితర అధికారులతో కలిసి ఓ కమిటీని ఏర్పాటు చేసింది. అలాగే ధరణి పేరుకు త్వరలోనే భూమాత అనే నామకరణం కూడా చేయనుంది. మరోవైపు ప్రస్తుతం ఉన్న రైట్ ఆఫ్ రికార్డ్సుయాక్ట్, 2020 లోని పలు మార్పులు చేసి, కొత్త నిబంధనలు తీసుకొచ్చి మళ్లీ ఆర్ఓఆర్ యాక్ట్, 2024 ను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. అయితే భూ సంస్కరణలను చేపట్టడంలో ప్రభుత్వానికి సాయం చేసేందుకు ల్యాండ్ గవర్నెన్స్ ఇన్నోవేషన్ సెల్ అలాగే




లీగల్ సపోర్ట్ సెల్‌ను రూపొందించాలని ప్రభుత్వానికి ధరణి కమిటీ సూచించింది.పెండింగ్‌లో ఉన్న ధరణి అప్లికేషన్లను పరిష్కరించడం మాత్రమే కాకుండా.. ప్రభుత్వం గ్రామీణ స్థాయిలో ఒక కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించాలని తెలిపింది. దీని ద్వారా రెవెన్యూ సదస్సులు, నిషధిత స్థలాల జాబితాలను సరిచేయడం, అప్‌డేట్ చేయడం లాంటి భూ ఫిర్యాదుల ఆర్జీలను స్వీకరించాలని చెప్పింది. అలాగే నిషేధిత స్థలాల జాబితా నుంచి 1958 కన్నా ముందు ఉన్న అసైన్డ్ భూములను డిలీట్ చేయాలని కోరింది. అయితే బీఆర్ఎస్ హయాంలో వీఆర్వో, వీఆర్ఏలను రద్దు చేశాక గ్రామీణ స్థాయిలో రైతులకు సపోర్ట్ చేసే అధికారి ఎవరూ కూడా లేదు. అందుకే రైతులకు అండగా ఉండేందుకు, గ్రామీణ ప్రాంతాల్లో ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్‌ను చూసుకునేందుకు ఓ బాధ్యతాయుతమైన వ్యక్తి ఉంచాలని కమిటీ భావిస్తోంది. ఇందుకోసమే పలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వానికి ప్రతిపాదించింది. దీనివల్ల రైతుల భూ సమస్యలు పరిష్కారమవుతాయని చెబుతోంది. అంతేకాదు విలేజ్ రెవెన్యూ కోర్టులు ఏర్పాటు చేయడం వల్ల కూడా భూ సమస్యలను పరిష్కారమవుతాయని కమిటీ స్పష్టం చేసింది.

## పన్నులు చెల్లించాల్సిందే..చంద్రబాబు ఫైర్



విజయవాడ :బుడమేరు వరదల్లో సర్వం కోల్పోయిన ప్రజల బాధల్ని పట్టించుకోకుండా విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ నెలాఖర్లోగా ఆస్తి పన్నులు చెల్లించాలని హెచ్చరించడంపై ఏపీ ప్రభుత్వం స్పందించింది. విజయవాడ నగరంలో దాదాపు రెండున్నర లక్షల కుటుంబాలు వరద ముంపుకు గురయ్యాయి. వీరిలో కనీసం లక్షన్నర కుటుంబాలు తీవ్రంగా వరద నష్టాన్ని ఎదుర్కొన్నాయి. దాదాపు పది రోజులు వరద ముంపులో కట్టుబట్టలతో మునిగిన ప్రజలకు విఎంసి హెచ్చరికలు ఆందోళనకు గురి చేశాయి. ఆస్తి పన్ను వసూళ్లపై కీలక ఆదేశాలు జారీ చేసింది. నగరంలోని వరద ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పన్ను వసూళ్లను తాత్కలికంగా నిలిపివేశారు.విజయవాడలో నెలకొన్న వరద పరిస్థితుల వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతుండటం, వరద ప్రభావిత ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజల ఆర్థిక స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కార్పొరేషన్ అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాలైన 32 డివిజన్‌లలో మూడు నెలల పాటు పన్ను వసూళ్లు వాయిదా వేశారు. నగరంలోని 1, 5,7,15,16,17,18,19, 20,21,22,30, 32, 40, 41,42,43,44, 45,46,47,54,55, 56,57,58, 59, 60,61,62,63,64 డివిజన్లలో వరద ముంపుకు గురైన ప్రాంతాల్లో మూడు నెలల పాటు ఆస్తి పన్ను, నీటి పన్ను, డ్రైనేజీ తదితర పన్నుల వసూళ్లను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

ఏం జరిగిందంటే

విజయవాడ నగరాన్ని వరదలు ముంచెత్తి నగరంలోని 32 డివిజనల్లో లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులుగా మారారు. పది రోజుల పాటు వరద ముంపులో చిక్కుకున్న ప్రజలు ఇప్పుడిప్పుడే ఇళ్లకు చేరుకుంటున్నారు. ఈ క్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ ఆదివారం జారీ చేసిన ప్రకటనతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. వరద బాధితులపై ఏమాత్రం సానుభూతి లేకుండా సెప్టెంబర్ 30వ తేదీలోగా పన్ను బకాయిలు చెల్లించాలని హెచ్చరికలు జారీ చేయడంపై ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ఆగ్రహం వ్యక్తమైంది.విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్ను బకాయిదారులంతా తమ తమ ఆస్తి పన్ను, మంచి నీటి కుళాయి చార్జీలు, డ్రైనేజి చార్జీలు, వాటర్ మీటర్ చార్జీలు, ఖాళీ స్థలముల పన్నులను మొదటి అర్ధ సంవత్సరానికి సెప్టెంబర్ 30వ తేదీలోగా చెల్లించాలని ఆదివారం నగర పాలక సంస్థ ప్రకటించింది. 30వ తేదీలోపు పన్ను చెల్లించకపోతే జరిమానాలు ఉంటాయని, నగరంలోని 3 సర్కిల్ కార్యాలయాల్లో , విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో పన్నులు చెల్లించాని పేర్కొన్నారు.

ఎటు చూసినా కన్నీళ్లే

విజయవాడ నగరంలో వరద ముంపుకు గురైన ప్రాంతాల్లో లక్షలాది మంది కట్టుబట్టలతో మిగిలారు. ఒక అంతస్తులోపు ఉన్న భవనాలు, రేకుల షెడ్లు, పెంకుటిళ్లలో ఉంటున్న వారికి కట్టుబట్టలు మినహా ఏమి మిగల్లేదు. సెప్టెంబర్ 1వ తేదీ తెల్లవారుజామున నిద్రలో ఉండగా వరద ముంచెత్తడం ప్రాణాలు కాపాడుకునే క్రమంలో ఎవరికి ఏమి మిగలకుండా పోయింది.ఈ క్రమంలో నగర పాలక సంస్థ పన్ను బకాయిల కోసం ప్రకటనలు ఇవ్వడం వరద బాధితుల్లో ఆగ్రహానికి కారణమైంది. వరద బాధితులకు ఇంటి పన్ను రద్దు చేయకపోగా, 15 రోజుల్లో చెల్లించకపోతే పెనాల్టీ పడుతుందని హెచ్చరిస్తూ ప్రకటనలు విడుదల చేయడంపై రాజకీయ పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.విజయవాడ నగరంలో 32 డివిజన్లలో దాదాపు 2,70,000 కుటుంబాలకు పైగా వరద ముంపుకు గురయ్యారు. వీరిలో కనీసం లక్షన్నర కుటుంబాలు దారిద్ర్య రేఖకు దిగువన ఉండే అల్పాదాయ వర్గాలకు చెందిన వారే ఉంటారు. దాదాపు 8 లక్షల మంది జనాభా వరదల్లో నీట మునిగి సర్వస్వం కోల్పోయారు. ఉపాధి లేక, వస్తువులు, వాహనాలు పాడైపోయి దుర్భర పరిస్థితులలో వేలాదిమంది చిక్కుకున్నారు. వేతన జీవులు మినహా అసంఘటిత రంగంలో ఉపాధి పొందే వారి పరిస్థితి ఘోరంగా ఉంది.వరద ముప్పును హెచ్చరించడంలో విఫలమైన విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ యంత్రాంగం పన్ను వసూళ్ల విషయంలో మాత్రం ప్రకటనలివ్వ డంపై వరద బాధితులు మండిపడుతున్నారు...బాధితులను ఆదుకోవాల్సిన సమయంలో పన్నులు చెల్లించకపోత్తె జరిమానాలు విధిస్తామని హెచ్చరిస్తూ ప్రకటనలు జారీ చేయడంపై ప్రజల్లో నిరసన వ్యక్తమైంది. దీనిపై స్పందించిన చంద్రబాబు వెంటనే పన్ను వసూళ్లు వాయిదా వేయాలని అధికారుల్ని ఆదేశించారు.

## తెలంగాణ తల్లి విగ్రహం - కేటీఆర్ ఆన్సర్ ఏది ?



హైదరాబాద్,రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తీసేస్తామని కేటీఆర్ ప్రకటంచి.. గొప్పగా బెదిరించానని అనుకుంటున్నారు. కానీ వచ్చే ఎన్నికల నాటికి రాజకీయ పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పడం కష్టం. అప్పుడు కాంగ్రెస్ తో పొత్తులో ఉంటే స్వయంగా ఆయనే పూలమాల వేయాల్సి రావొచ్చు. అధికారంలోకి రాకపోతే దానికి కూడా చాన్స్ ఉండకపోవచ్చు. కానీ ఇప్పటికైతే మరో నాలుగేళ్ల పాటు రాజీవ్ విగ్రహం అక్కడే ఉంటుంది. ఇప్పుడు కేటీఆర్ఆన్సర్ చేయాల్సిన అసలు క్వశ్చన్ ఆయనకు పదే పదే ఎదురవుతోంది. అదే తెలంగాణ తల్లి విగ్రహం పదేళ్ల పాటు ఎందుకు పెట్టలేదు ? సెక్రటేరియట్ ఇటీవల కట్టారు. అందులో తెలంగాణ తల్లి విగ్రహం పెడతామని బీఆర్ఎస్ గతంలో ఎక్కడా చెప్పలేదు. ఓ విగ్రహం కోసం అక్కడ స్థలాన్ని రిజర్వ్ చేశారు. అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలనుకున్నామని రేవంత్ .. రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టేందుకు శంకుస్థాపన చేసినప్పుడు కేటీఆర్ విమర్శించడం ప్రారంభించారు. అప్పుడు అందరికీ వచ్చిన డౌట్ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పెట్టలేదు ?. అసలు తెలంగాణ తల్లి విగ్రహం ఎక్కడైనా ఉందా ?. బీఆర్ఎస్ సిద్ధం చేసిన విగ్రహం తెలంగాణ భవన్ లో ఉంటుంది కానీ అధికారికంగా ఎక్కడా పెట్టలేదు. అసలు ఆ ఆలోచన కూడా చేయలేదు. దీన్నే రేవంత్ ప్రశ్నిస్తున్నారు. ఈ అంశాన్ని బీఆర్ఎస్ వినిపించుకోనట్లే ఉంది. తెలంగాణ తల్లి విగ్రహాన్ని పదేళ్ల పాటు ఎందుకు పెట్టలేని పరంపరగా వస్తున్న ప్రశ్నలపై కేటీఆర్ వద్ద సమాధానం లేదు. ఆయన రాజీవ్ విగ్రహం తొలగింపుపై మాత్రమే మాట్లాడుతున్నారు. రేవంత్ అసలు ఆ స్థలాన్ని తెలంగాణ తల్లి విగ్రహం కోసం కాదని..కేసీఆర్ విగ్రహాన్ని పెట్టుకునేందుకు రిజర్వ్ చేశారని అందుకే ఇంత రాజకీయం చేస్తున్నారని అంటున్నారు. కారణం ఏదైనా తెలంగాణ తల్లి విషయంలో బీఆర్ఎస్ నిర్లక్ష్యాన్ని కాంగ్రెస్ బాగానే హైలెట్ చేస్తోంది. దీనికి కేటీఆర్ వద్ద సమాధానం లేదు.

## ఓటర్ జాబితా రూపకల్పనలో సహకరించాలి



సిరిసిల్ల, గ్రామీణ ఓటర్ జాబితాను పకడ్బందీగా రూపొందించేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సంపూర్ణ సహకారం అందజేయాలని, ఓటరు జాబితా రూపకల్పనపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ తో కలిసి గ్రామీణ ఓటర్ల జాబితా రూపకల్పనపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు 2వ సాధారణ ఎన్నికల నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా రూపకల్పనకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని, ఈ షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 13న గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేసి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న 260 గ్రామ పంచాయతీల పరిధిలోని 2268 వార్డుల్లో మొత్తం 3 లక్షల 46 వేల 220 ఓటర్లతో డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేశామని, ఇందులో గల అభ్యంతరాలు, నూతన ఓటర్ నమోదు దరఖాస్తులను సెప్టెంబర్ 21 లోపు సంబంధిత మండలాల ఎంపీడీఓలకు లిఖిత పూర్వకంగా సమర్పించాలని, సెప్టెంబర్ 26 లోపు అభ్యంతరాలను పరిష్కరించి, సెప్టెంబర్ 28న తుది ఓటర్ జాబితా విడుదల చేయడం జరుగుతుందన్నారు.

## నిమజ్జనంలో అపశృతి.. క్రేన్ ప్రమాదంలో ఒకరి మృతి..

కొమరంభీం: వినాయక నిమజ్జనంలో అపశృతి చోటు చేసుకుంది. కాగజ్ నగర్ పెద్దవాగు వద్ద క్రేన్ ప్రమాదంలో ఇద్దరు మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు గాయాలయ్యాయి. అయితే తీవ్ర గాయాలైన మున్సిపల్ కార్మికుడు లింగంపల్లి నగేష్ (50) హైదరాబాద్ కు తరలిస్తున్న క్రమంలో మృతిచెందాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు మరో కార్మికుడు. దీంతో నిమజ్జనం విధులను బహిష్కరించింది మున్సిపల్ కాంట్రాక్ట్ సిబ్బంది.అటు ఈ సంఘటనపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. కాగజ్ నగర్ వినాయక నిమజ్జన వేడుకల్లో అధికారుల నిర్లక్ష్యం వల్ల లింగంపల్లి నాగేష్ అనే కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందడం, ప్రేమ్ అనే ఇంకొక కార్మికుడు తీవ్రంగా గాయపడడం అత్యంత బాధాకరమన్నారు. కనీస జాగ్రత్తలు కూడా తీసుకోకుండా మునిసిపల్ సిబ్బందిని కేవలం మాట్లాడే పనిముట్లుగా చూడడం వల్లనే



ఇలాంటి సంఘటనలు జరుగుతున్నవని తెలిపారు. మృతుడి కుటుంబంలో ఒకరికి తప్పకుండా ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



కొత్తపేటలోని లక్ష్మీ వైట్ హౌస్ హ్యాండ్లూమ్ టెక్స్టైల్స్ మరియు జువెలరీ షాపింగ్ కాంప్లెక్స్ లో మొదటి సంవత్సరం గణేష్ శ్రీ లడ్డు దక్కించుకున్న చిక్కా చంద్రమోహన్,

## సంపాదకీయం

**గురువారం 19-09-2024**

# పాలకుల నిర్లక్ష్యం వల్లే బుడమేరు విలయం

ఆగస్టు 30, 31 సెప్టెంబర్ ఒకటవ తేదీలలో వాయుగుండం ప్రభావంతో కురిసిన కుండపోత వర్షాలకు విజయవాడ నగరం అతలాకుతలం అయింది. ఎన్టీఆర్, కృష్ణ, గుంటూరు, బాపట్ల, ఏలూరు జిల్లాలను వరదలు ముంచాయి. కృష్ణా నదికి ఎన్నడూ లేనంతగా 11.43 లక్షల క్యూసెక్కుల వరద రాగా, అదే సమయంలో బుడమేరకు 43 వేల క్యూసెక్కుల వరద వచ్చింది. బుడమేరు డైవర్షన్ ఛానల్‌కు మూడు చోట్ల గండ్లు పడడంతో విజయవాడ నగరంలో 31 వార్డులు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. విజయవాడ పరిసర గ్రామాలు, కృష్ణా నది కట్ట లోపల గ్రామాలు ముంపుకు ఉన్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం లక్షల వరద ప్రభావానికి ఏడు, ఎన్టీఆర్, కృష్ణ గుంటూరు, బాపట్ల, 5.67 లక్షల ఎకరాల పంటలు నీట మునిగాయని గుర్తించారు.

ఆగస్టు 20 నాటికే ఆల్మట్టి నుండి పులిచింతల వరకు ప్రాజెక్టులన్నీ పూర్తిగా నిండిపోయాయి. 28వ తేదీన వాతావరణ శాఖ తుఫాను హెచ్చరిక చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదు. ప్రజలు వరదలలో చిక్కుకుపోయారు. కట్టుబట్టలతో మిగిలారు.

పాలకుల నిర్లక్ష్యం

బుడమేరుపై పాలకుల నిర్లక్ష్యం ఈనాటిది కాదు. 1960 బుడమేరుపై వెలగలేరు వద్ద రెగ్యులేటర్, కృష్ణ నదిలో డైవర్షన్ ఛానల్ నిర్మించబడింది. 1964 రికార్డు స్థాయిలో వరద వచ్చినప్పుడు కేంద్ర సంఘం ఏసీ మిత్ర జల నిపుణుల కమిటీని నియమించింది. కొల్లేరు దాని పరివాహక ప్రాంతంలో కొల్లేరులో కలిసే బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు, ఎర్ర కాలువ, గుండేరు, ఉప్పుటేరును సమగ్రంగా పరిశీలించిన మిత్ర కమిటి ముంపు నివారణ చర్యలు సూచించింది. ఆనాడు రూ.15 కోట్లతో ప్రణాళిక రూపొందించారు. వరద ప్రమాద నివారణకు బుడమేరుపై చర్యలు ప్రధానమైనవని చెప్పింది. ప్రభుత్వం ఆ సూచనల అమలుకు పూనుకోలేదు. 1977-78 కాలంలో తిరిగి తీవ్రమైన వరదలు వచ్చాయి. అప్పుడు జె.సి ముర్రే నాయకత్వాన మరో కమిటీని నియమించారు. ఆ కమిటీ వరదల నివారణకు రూ.43 కోట్లతో ప్రణాళిక రూపొందించింది. అదీ అమలుకు నోచుకోలేదు. 1986లో శ్రీరామకృష్ణయ్య కమిటీని నియమించారు. ఆ చర్యలను తీసుకోని పక్షంలో విజయవాడ నగరానికి వచ్చే ముంపు గురించి తెలుస్తుంది. ఆ కమిటీ సూచనలు అమలుకు పూనుకోలేదు. 1986-1987-1988 సంవత్సరాలలో వరుసగా వరదలు వచ్చాయి. 1986లో రెండు లక్షల ఎకరాలు, 1987లో 2.73 లక్షల ఎకరాలు, 88లో 1.5 లక్షల ఎకరాలు కృష్ణ డెల్టాలో చేతికి వచ్చిన పంటలు వరదల పాలయ్యాయి.

రైతాంగం ఆందోళనలు

ఈ కాలం అంతా వివిధ రూపాలలో ఆందోళనలు సాగిస్తూ వచ్చిన కృష్ణా జిల్లా రైతు సంఘం దీర్ఘకాలిక పోరాటానికి సిద్ధమైంది. 1989 సెప్టెంబర్ 26న గన్నవరంలో సదస్సు నిర్వహించారు. 2000 మంది రైతులు ఉన్నారు. ఆ సదస్సులో ముఖ్యమంత్రి సలహాదారుగా ఉన్న ప్రఖ్యాత ఇంజనీర్ శ్రీరామకృష్ణయ్య, డ్రైనేజీ బోర్డు చైర్మన్ తుమ్మల చౌదరి, ఏపీ రైతు సంఘం నాయకులు కొరటాల సత్యనారాయణ, పార్లమెంట్ సభ్యులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, అట్లూరు శ్రీమన్నారాయణ. శ్రీరామకృష్ణయ్య ఆ మరుసటి రోజే ఇరిగేషన్ డ్రైనేజ్ అధికారులతో రైతు సంఘాల నాయకులతోనూ ప్రత్యేక సమావేశం జరిపి చర్చించి ముంపు నివారణకు చేపట్టవలసిన చర్యలపై ప్రణాళిక రూపొందించి అధికారులు పురమాయించారు. ఆనాటి ఇరిగేషన్ ఎస్.ఇ గా ఉన్న మనోహరం రూ.75.60 కోట్లతో చేపట్టవలసిన వరద నివారణ చర్యలకు ప్రణాళిక రూపొందించారు.పై ప్రణాళిక అమలు కోసం కృష్ణా జిల్లా రైతు సంఘం నాయకులు వై.కేశవరావు, సూరపనేని సుబ్రహ్మణ్యం, నీలం మురలీకృష్ణా రెడ్డి, ఆళ్ల ఈశ్వరరావు, గూడపాటి వెంకటేశ్వరరావు, మూలుపూరు వెంకటరత్నాలతో కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేశారు. వరుసగా రాయబారాలు, ధర్నాలు రాస్తారోకోలు నిర్వహించారు. పుట్టగుంట దగ్గర బుడమేరు వంతెనపై 1000 మంది రైతులతో ఎడ్లబండ్లతో ధర్నా నిర్వహించారు. ముదినేపల్లిలో ఎర్నేని నాగేంద్రనాథ్ వగైరాలు నిరాహార దీక్షగా శిబిరానికి మద్దతుగా 1000 మంది రైతులను సమీకరించి సభ నిర్వహించారు. పరివాహక ప్రాంతంలోని 20 కేంద్రాలలో రాస్తారోకోలు నిర్వహించారు. 1990 జూన్ 4వ తేదీ గుడివాడ ఆర్డీఓ కార్యాలయాన్ని 3000 మంది రైతులతో ముట్టడించింది. ఏడవ తేదీ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి ఉపప్రధాని దేవీలాల్ రాక సందర్భంగా రైతులను సమీకరించింది. ఫలితంగా పనులు జరిగాయి. పనుల పర్యవేక్షణకు బి.సి. శర్మ పది మంది నిపుణుల బృందం ఏర్పడింది.

వరద నివారణ పనులు జరిగిన తీరు

ఆ కాలంలో గుండేరు, లజ్జబండ, పోల్రాజు డ్రైన్, పోల్‌రాజు కాలువ, డెల్టాలో బుడమేరుకు చానలైజేషన్ పనులు జరిగాయి. కృష్ణా నదికి కరకట్టలు అభివృద్ధి పనులు జరిగాయి ముంపు నివారణకు ప్రధానమైన రాయనపాడు నుండి రామవరప్పాడు వరకు స్ట్రెయిట్ కట్ నిర్మాణంగా, బుడమేరు నుండి కృష్ణా నదికి మరొక డైవర్షన్ ఛానల్ నిర్మాణం లేదా, విజయవాడ నగరంలో కట్టల అభివృద్ధి చర్యలు చేపట్టలేదు. వెలగలేరు వివిధ ప్రాంతాల రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టలేదు. బ్రహ్మయలింగం చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసే పనులు చేపట్టినప్పటికి మధ్యలోనే నిలిపివేశారు. పైగా విజయవాడ నగరంలో బుడమేరుకు కట్టల లోపల గదులు, కాలనీలు ఏర్పాటయ్యాయి. వరద కట్టలు శిథిలావస్థకు చేరుకున్నాయి. విజయవాడలో విస్తరించిన పేదల కాలనీలన్నీ బుడమేరు పరివాహక ప్రాంతంలోనే సాగాయి. అనంతరం కష్ణ డెవలప్‌మెంట్ పనులపై ప్రధాన ముంపు నివారణ పనులు జోలికి వెళ్లలేదు.మిత్ర కమిటీ సూచనలకు 60 ఏళ్లు, ముర్రే కమిటీ, శ్రీరామకృష్ణయ్య సూచనలకు 45 ఏళ్ల నిండాయి. డ్రైనేజీ బోర్డును ఎత్తేశారు. గుడివాడ, తెనాలి, భీమవరంలో డీఈ కార్యాలయాలు మాత్రమే ఉన్నాయి. జిల్లా ఇరిగేషన్ అధికారులే డ్రైనేజ్ ఇన్‌చార్జిలుగా ఉన్నారు. గత రెండు దశాబ్దాలుగా కృష్ణా జిల్లాకు రెగ్యులర్ ఎస్.ఐ లేరు. ఇన్ చార్జీలు మాత్రమే ఉన్నారు. నిరంతరం కాలువలపై పని చేసే లస్కర్లను తగ్గించి వేశారు. డ్రైనేజీ వ్యవస్థ నిర్లక్ష్యం చేయాలి.ఈ కాలంలో 20 సంవత్సరాలు తెలుగుదేశం, 20 సంవత్సరాల కాంగ్రెస్, ఐదు సంవత్సరాల వైఎస్ఆర్‌సిపి పరిపాలించాయి. ఫలితాల నిపుణుల కమిటీల సూచనల అమలుపై నిర్లక్ష్యం. ఫలితం విజయవాడ నగరంలో వరద విలయ తాండవం.

ప్రస్తుత విజయవాడ-బుడమేరు పరిస్థితి

యాభయ్యేళ్ల నాడు విజయవాడ జనాభా ఐదు లక్షలు. ఈనాడు 15 లక్షలు. ఇబ్రహీంపట్నం కొండపల్లి మున్సిపాలిటీగా అభివృద్ధి అయ్యింది.

# మోడీ రాకతో రాజకీయ స్థిరత్వం



న్యూఢిల్లీ,ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు ఏర్పడి వంద రోజులు దాటిన నేపథ్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ..మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు దేశంలో రాజకీయ స్థిరత్వాన్ని తీసుకువచ్చిందన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని, ప్రజలు వాటికి సాక్ష్యాలుగా నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు. అమిత్ షాతో పాటు మంత్రులు అశ్వినీ వైష్ణవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 100 రోజుల పాలనలో సాధించిన ప్రగతిపై రూపొందించిన ఓ బుక్‌లెట్‌ను అమిత్ షా ఆవిష్కరించారు. పదేళ్ల అభివృద్ధి, భద్రత, సంక్షేమం తర్వాత ప్రజలు మూడవ సారి బీజేపీ మిత్ర కూటమిని మరోసారి ఆశీర్వదించారని ఆయన పేర్కొన్నారు. గడిచిన 60 ఏళ్లలో ఇలా జరగడం ఇదే మొదటిసారి అని పేర్కొన్నారు. ఇది దేశంలో రాజకీయ స్థిరత్వాన్ని తీసుకువచ్చిందని, పాలసీలను సమర్థవంతంగా అమలు చేశామన్నారు. ప్రధాని మోదీ తీసుకువచ్చిన కొత్త విద్యా విధానంలో.. ప్రాచీన, ఆధునిక విద్యా వ్యవస్థలు ఉన్నట్లు తెలిపారు. ఆ విద్యా వ్యవస్థ ప్రాంతీయ భాషలను గౌరవిస్తుందని హోంమంత్రి తెలిపారు. వంద రోజుల పాలన సమయంలో.. సుమారు మూడు లక్షల కోట్ల ప్రాజెక్టులను ప్రకటించినట్లు ఆయన వెల్లడించారు. గత పదేళ్లలో ఇండ్లు, టాయిలెట్లు, గ్యాస్ కనెక్షన్లు, త్రాగునీరు, విద్యుత్తు, ఉచిత ఆహార ధాన్యాలు, ఆరోగ్యం అందించినట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల వరకు దేశంలో ఇండ్లు లేని వారు ఉండకూడదన్న లక్ష్యంతో పనిచేయనున్నట్లు అమిత్ షా తెలిపారు.

ఇకపోతే దేశంలో వరుసగా జరుగుతున్న రైలు ప్రమాదాల వెనక ఏదైనా కుతంత్రాలు దాగి ఉంటే వెలికి తీస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. కుట్రలు ఎక్కువ రోజులు దాగి ఉండవని వ్యాఖ్యానించారు. 1.10 లక్షల కిలోమీటర్ల రైల్వే నెట్‌వర్క్ పరిరక్షణకు ప్రభుత్వం అతి త్వరలోనే కీలక చర్యలు తీసుకొంటుందని వెల్లడించారు. ప్రభుత్వ పనితీరును ఆయన వివరిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

రైల్వే భద్రతపై ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఈ అంశంపై తాను చర్చించానని అమిత్‌షా పేర్కొన్నారు. 'రైల్వే ప్రమాదాల విషయానికి వస్తే వాటి మూలకారణాలపై దర్యాప్తు చేస్తాం. కారణం ఏదైనా.. ప్రభుత్వం వీటిపై దృష్టి పెడుతుంది. ఇది కుట్ర అయితే.. ఎక్కువ కాలం కొనసాగదు. ఏమైనా లోపాలు ఉంటే వాటిని సరిచేస్తాం. ఇటీవల ఘటనలను దృష్టిలో పెట్టుకొని బలమైన ప్రణాళికను సిద్ధం చేసుకొంటున్నాం.'హొదీ ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో 38 రైలు ప్రమాదాలు జరిగాయంటూ కాంగ్రెస్ చేసిన ఆరోపణలను అమిత్‌షా కొట్టి పారేశారు. అవి మొత్తం చిన్న ఘటనలని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో రైల్వే నెట్‌వర్క్‌ను గణనీయంగా విస్తరిస్తున్నట్లు ప్రజలు గుర్తించారన్నారు. ఈ 100 రోజుల్లోనే ఎనిమిది కొత్త రైల్వే ప్రాజెక్టులకు ఆమోద ముద్రవేసినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులతో దాదాపు 4.42 కోట్ల మానవ పనిదినాల ఉపాధి లభిస్తుందని కేంద్ర హోం మంత్రి వెల్లడించారు. ఇటీవల కొందరు దుండగులు పట్టాలపై ఎల్‌పీజీ సిలిండర్లు, సైకిళ్లు, ఇనుప రాడ్లు, సిమెంట్ ఇటుకలను పెట్టి రైలు ప్రమాదాలు జరిగేలా దుశ్చర్యలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. గత ఏడాది జూన్ నుంచి ఈ తరహాలో 24 ఘటనలు జరిగాయని భారత రైల్వే కొన్నాళ్ల క్రితం నివేదికలో వెల్లడించింది. అందులో ఆగస్టులో 15, సెప్టెంబర్‌లో 3 ఘటనలను గుర్తించారు. అత్యధికంగా ఉత్తర్‌ప్రదేశ్, తర్వాత పంజాబ్, ఝూర్ఖండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశా, తెలంగాణలో ఈ కుట్రపూరిత యత్నాలు బయటపడ్డాయి. ఆగస్టులో కాన్పూర్ సమీపంలో సబర్మతి ఎక్స్‌ప్రెస్ 20 బోగీలు పట్టాలు తప్పాయి. ట్రాక్‌పై ఉంచిన ఓ వస్తువు కారణంగా ఈ పరిస్థితి తలెత్తింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంపై అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత కాన్పూర్, రాజస్థాన్‌లోని అజ్మీర్‌లోను ఈ తరహా ఘటనలు వెలుగుచూశాయి.

# కౌలు రైతులను విస్మరించిన కాషాయ సర్కార్

న్యూఢిల్లీ,కౌలు రైతులను కాషాయ పాలకులు విస్మరించారని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర ఆర్థిక మాజీ మంత్రి పీ చిదంబరం శాఖ. పీఎం కిసాన్ యోజనను కౌలు రైతులకు వర్తింపచేయడం లేదు. చిదంబరం సోమవారం చండీఘడ్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. దేశంలో మొత్తం సాగు భూమిలో 32 శాతం కౌలు రైతులు సాగుచేస్తున్నారని వివరించారు. రైతుల ప్రజాస్వామిక హక్కులను అణిచివేయడం బీజేపీ ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరిని బహిర్గతం చేస్తోందని దుయ్యబట్టారు.ఇక గత పదేండ్లుగా హరియాణలో పాలక బీజేపీ ప్రభుత్వం రైతులకు వ్యవసాయ రుణ వితరణలో పూర్తిగా విఫలమైంది. కాగా, హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి భంగపాటు తప్పదని కేంద్ర మంత్రి, హరియాణ మాజీ సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ అన్నారు. కాంగ్రెస్‌తో పొత్తుకు ఏ పార్టీ ముందుకు రావడం లేదని చెప్పారు. రిజర్వేషన్లు, సిక్కులపై కాంగ్రెస్ నేతలు అసంబద్ధ వ్యాఖ్యలు చేశారు.హరియాణ సీఎం నయబ్ సింగ్ సైనీ రాష్ట్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందని అన్నారు. హరియాణలోని ఝజర్‌లో సోమవారం ఆయన విలేకరుల




సమావేశంలో మాట్లాడారు. రిజర్వేషన్ల తొలగింపుపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ అమెరికాలో చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని పేర్కొన్నారు. రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ ఆలోచనలు బట్టబయలయ్యాయని అన్నారు. విదేశీ గడ్డపై రాహుల్ దేశాన్ని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం ఆయనకు అలవాటుగా మారిందని.

# గడువు తీరినా పూర్తికాని భూసేకరణ..

# ట్రిపుల్‌ఆర్‌పై తొలగని ప్రతిష్ఠంభన



హైదరాబాద్,: రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్) ఉత్తర భాగం భూసేకరణ కోసం ప్రభుత్వం నిర్దేశించుకున్న గడువు ఆదివారంతో పూర్తయింది. కానీ, పరిస్థితి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగానే ఉన్నది. ఆరు నెలల క్రితం నాటి పరిస్థితే నేటికీ కొనసాగుతున్నది. ఇంకా 20% భూమిని సేకరించాల్సి ఉన్నది. ఈ భూసేకరణకు జాతీయ రహదారుల శాఖ నోటిఫికేషన్ జారీచేసి చేతులు దులుపుకోవడం, రైతుల నుంచి వ్యక్తమవుతున్న వ్యతిరేకత, కోర్టు కేసుల వల్ల ఒక్క అడుగు కూడా ముందుకు సాగడంలేదు. ట్రిపుల్‌ఆర్ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ హయాంలోనే ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలన్న పట్టుదలతో ఉన్నది. అందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి తరచూ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ భూసేకరణను వేగవంతం చేయాలని ఆదేశిస్తున్నారు. సెప్టెంబర్ 15లోగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలని ఆగస్టులో గడువు నిర్దేశించారు.మొత్తం 348 కి.మీ. పొడవైన ట్రిపుల్‌ఆర్ నిర్మాణానికి దాదాపు 10 వేల ఎకరాల భూములు అవసరమవుతాయి. అందులో 158.65 కి.మీ. పొడవైన ఉత్తర భాగం నిర్మాణానికి సుమారు 4,600 ఎకరాలు సేకరించాల్సి ఉండగా.. ఇప్పటివరకు 3,500 ఎకరాలు మాత్రమే సేకరించారు. మిగిలిన 1,000 ఎకరాల్లో దాదాపు 200 ఎకరాలు అటవీ భూమి ఉండటంతో దానికి దీనికి ప్రత్యామ్నాయంగా మరోచోట భూములు గుర్తించారు. మిగిలిన చోట్ల భూసేకరణను వ్యతిరేకిస్తూ రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కోర్టు స్టే విధించింది. భూసేకరణ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ ధరకు మూడు రెట్లు అధికంగా చెల్లించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ సిద్ధంగా ఉన్నప్పటికీ రైతులు ససేమిరా అంటున్నారు. ఈ ప్రతిష్ఠంభనను తొలగించేందుకు జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో ప్రభుత్వం అర్బిట్రేషన్‌ను ఏర్పాటు చేసినప్పటికీ బహిరంగ మార్కెట్‌లో భూముల ధరలకు, ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయించన ధరలకు పొంతన లేకపోవడంతో చర్చలు ముందుకు సాగడంలేదు. ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగం నిర్మాణానికి ఇంకా 20% భూసేకరణ పెండింగ్‌లో ఉన్నదని, ఇది పూర్తయ్యాకే టెండర్ల ప్రక్రియ చేపడతామని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చెప్తున్నారు.

బలవంతంగా భూసేకరణకు యత్నాలు

ట్రిపుల్‌ఆర్ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలతో ఉండటంతో నష్టపరిహారాన్ని కోర్టులో డిపాజిట్ చేసి బలవంతంగా భూములు స్వాధీనం చేసుకునేందుకు కలెక్టర్లు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. రైతులను సంతృప్తిపర్చడం సాధ్యంకాదని నిర్ధారణకు వచ్చిన అధికారులు.. చట్టంలో ఉన్న వెసులుబాటును ఆధారంగా చేసుకొని ముందుకు సాగాలని నిర్ణయించినట్టు తెలిసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంపీగా ఉన్న ప్రస్తుత రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గతంలో భూసేకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిన రైతులకు మద్దతు తెలిపారు. ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చుతామని అప్పట్లో వారికి హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో తాజాగా అధికారులు బలప్రయోగం ద్వారా భూసేకరణకు సన్నాహాలు చేస్తున్నారన్న వార్తలు రైతులకు మరింత ఆగ్రహాన్ని తెప్పిస్తున్నాయి.

### చేతనైతే ఇచ్చిన హామీలు అమలు చేయండి

హైదరాబాద్,ఢిల్లీ పెద్దల మెప్పు కోసమే సచివాలయం ఎదుట దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని స్థాపించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం నాడు తెలంగాణ భవన్‌లో జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను మాజీ మంత్రి ఆవిష్కరించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో సోనియాగాంధీని బలిదేవత అని, రాహుల్ గాంధీని ముద్దపప్పు అని తిట్టారని.. ఇప్పుడు వాటిని కవర్ చేసుకోవడానికి రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజీవ్ గాంధీ కంప్యూటర్ కనిపెట్టాడని రేవంత్ రెడ్డి చెప్తున్నారని... కంప్యూటర్ కనిపెట్టిన ఛార్లెస్ బాబేజ్ ఆత్మ ఎక్కడున్నా బాధపడుతుందంటూ ఎద్దేవా చేశారు. మీకు చేతనైతే హామీలు అమలు చేయండి.. 420 అడ్డగోలు హామీలు అమలు చేయండి. చేతనైతే రైతుబంధు ఇవ్వండి వానాకాలంకు 14 రోజులే మిగిలింది. చేతనైతే కరెంటు సరిగా ఇవ్వండి. చేతనైతే పింఛన్లు, మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి. రేవంత్ రెడ్డి చేతనైతే మీరు ఇచ్చిన హామీలు నెరవేర్చండి అంటూ హితవుపలికారు. పోలీస్ బండ్లల్లో డీజిల్ పోయడానికి నిధులు ఇవ్వడంలేదని విమర్శించారు.

# అక్టోబర్1 నుంచి కొత్త మద్యం పాలసీ

అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబర్ 1 నుంచి ఏపీలో కొత్త మద్యం విధానం అమల్లోకి రానుంది. కొత్త మద్యం విధానంపై కీలక విషయాలను మంత్రివర్గ ఉపసంఘం మీడియా సమావేశంలో వెల్లడించింది. కేబినెట్ సబ్ కమిటీలో సభ్యులైన మంత్రులు కొల్లురవీంద్ర, నాదెండ్ల మనోహర్ ,సత్య కుమార్, కొండపల్లి శ్రీనివాస్‌లు సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడారు. 6 రాష్ట్రాల్లో మద్యం అమ్మకాలను పరిశీలించామని వారు తెలిపారు. గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపులు కేటాయిస్తామన్నారు. కొత్త మద్యం పాలసీని బినెట్ ముందుపెడతామన్నారు. గత ప్రభుత్వంలో మద్యం ధరలను విపరీతంగా పెంచారని విమర్శించారు. మద్యం రేట్ పెరగడంతో పేదలు గంజాయికి అలవాటుపడ్డారన్నారు. తక్కువ ధరకే నాణ్యమైన మద్యం ఇస్తామని మంత్రివర్గ ఉపసంఘం పేర్కొంది.

ఏపీలో మద్యం విధానం పై ఏర్పాటైన సబ్ కమిటీ అయిదుగురు మంత్రులతో సీఎం ఏర్పాటు చేశారని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గతంలో మద్యం వ్యవస్థను వారి గుప్పిట్లోకి తెచ్చుకోవడానికి ఎక్సైజ్ వ్యవస్థను నాశనం చేశారని ఆయన అన్నారు. 70 శాతం మందితో ఎస్ఈబీ అని పెట్టి ఎన్‌ఫోర్స్‌మెంట్ లేకుండా చేశారన్నారు. ప్రభుత్వ షాపుల్లో జే బ్రాండ్‌లను మాత్రమే అందుబాటులో ఉంచి విచ్చలవిడిగా దోచేశారని ఆరోపించారు. మద్యపాన నిషేదం అని దశలవారీగా ఎత్తేస్తామని చెప్పి పదేపదే మాటమార్చారన్నారు. విపరీతమైన రేట్లు పెట్టి సామాన్యులను అప్పులు పాలు చేశారని.. సామాన్యుల ఆదాయాన్ని దోపిడీ చేశారని విమర్శించారు. ఈ దోపిడీ ఆదాయం వారి జేబుల్లోకి వెళ్ళిపోయిందని.. అర్హత లేని వ్యక్తిని డిప్యూటేషన్‌పై తెచ్చి దోచేశారని ఆరోపించారు. నాసిరకం అయిన బ్రాండ్స్ తెచ్చి ప్రజల ఆరోగ్యాలతో ఆడుకున్నారని, చాలామంది అనారోగ్యం పాలయ్యి చాలామంది మృత్యువాత పడ్డారని అన్నారు. డిస్టలరీల వ్యవస్థను మొత్తం వారి చేతుల్లోకి తీసుకున్నారు. షాపులలో 150 ది ఉందా 200 ది ఉందా అని అడగాల్సి వచ్చింది. నాశిరకం మద్యం తాగలేక నాటుసారా, ఎన్‌డీపీఎల్‌లకు వెళ్లిపోయారు.తెలంగాణ, తమిళనాడు, ఒడిశా నుండి ఎక్కవ మద్యం రాష్ట్రానికి వచ్చింది. 1994 తరువాత ఏపీలో పాలసీ దేశానికే ఆదర్శం అయ్యింది. ఇప్పుడు ఆరు రాష్ట్రాలకు వెళ్లి అక్కడ పాలసీ, టాక్సేషన్ విధానంపై అధ్యయనం చేశాం. కల్లుగీత కార్మికులకు 10శాతం షాపులు ఇస్తామని చెప్పాము. ఈరోజు నాల్గవ సమావేశం అయ్యింది. రేపు క్యాబినెట్ ముందు మా ప్రతిపాదనలను సరసమైన ధరలకు నాణ్యంమైన మద్యం అందించాలని నిర్ణయించాం. రేట్లు పెంచడం వల్ల చాలామంది గంజాయికి, డ్రగ్స్‌కు డైవర్ట్ అయ్యారు.మరోవైపు మద్యం నియంత్రణకు కొంత ఫండింగ్ ఇవ్వాలని నిర్ణయించామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మద్యం విధానంపై క్షేత్రస్థాయిలో వివిధ సంఘాల నుంచి నివేదికలు తెప్పించుకున్నామని, క్యాబినెట్‌లో తమ నివేదికలను సమర్పిస్తామని మంత్రులు తెలిపారు. ఏపీలో నూతన మద్యం విధానంపై సీఎం చంద్రబాబుతో మంత్రివర్గ ఉపసంఘం సమావేశమై చర్చించింది. గత పాలకులు జే బ్రాండ్ మద్యం తీసుకువచ్చారు. మద్యపానం నిషేధమని మాయమాటలు చెప్పి సొంత బ్రాండ్లు ప్రవేశపెట్టారు. మల్టీ నేషనల్ బ్రాండ్లు రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకున్నారు. ప్రభుత్వ ఆదాయం పాలకుల జేబుల్లోకి వెళ్లింది. అర్హత లేని వ్యక్తిని డిప్యుటేషన్‌పై తీసుకొచ్చి వ్యవస్థను భ్రష్టుపట్టించారు. నాసిరకం బ్రాండ్లు తెచ్చి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడారు. గత ప్రభుత్వ తప్పుడు విధానాలతో రాష్ట్రం ఆర్థికంగా నష్టపోయింది. గతంలో ఎక్సైజ్ పాలసీని జేబులు నింపుకోవడానికే వాడుకున్నారు. భవిష్యత్తులో వచ్చే ఆదాయంపై కూడా అప్పులు తెచ్చారు. నాణ్యత లేని మద్యం సరఫరా చేసి ప్రజల జీవితాలతో చెలగాటమాడారు. ఆడబిడ్డల పుస్తెలతాళ్లు తెగడంతో వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ప్రజారోగ్యం దృష్ట్యా కొత్త ఎక్సైజ్‌విధానం రావాలని అన్నారు. వివిధ రాష్ట్రాల్లోఅనుసరిస్తున్న విధానాలను ఉన్నతాధికారులు తెలిపారు. ఆరు రాష్ట్రాల నుంచి సేకరించిన సమాచారాన్ని అందజేశారు. పలు మార్పులు చేర్పులతో పాటు తదుపరి కార్యాచరణపై సీఎం పలు సూచనలు చేసినట్లు సమాచారం.అక్టోబర్ 1 నుంచి నూతన మద్యం విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. గురువారంలోపు దీనిపై ప్రకటన వచ్చే అవకాశముంది. క్యాబినెట్ సమావేశంలో దీనిపై చర్చించిన అనంతరం నూతన మద్యం విధానాన్ని ఖరారు చేయన్నూరు.

# తిరుమల ఆర్జిత సేవా టిక్కెట్లు

తిరుమల,తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన డిసెంబరు నెల కోటాను బుధవారం ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవాటికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం సెప్టెంబరు 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని అధికారులు వివరించారు. ఈ టికెట్లు పొందిన వారు సెప్టెంబరు 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయని వెల్లడించారు. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను సెప్టెంబరు 21న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తామన్నారు. అదే రోజు వర్చువల్ సేవల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించినకోటాను విడుదల చేయనున్నామని చెప్పారు. ఉసెంబరు నెలకు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను సెప్టెంబరు 23న ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు టికెట్లు ఉదయం 11 గంటలకు విడుదల చేస్తామని పేర్కొన్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించు కునేందుకు వీలుగా నవంబరు నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుందని వెల్లడించారు. ఉసెంబరు నెలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను సెప్టెంబరు 24న ఉదయం 10 గంటలకు, తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు విడుదల అవుతాయని వివరించారు. సెప్టెంబరు 27న తిరుమల ? తిరుపతి శ్రీవారి సేవ కోటా ఉదయం 11 గంటలకు, నవనీత సేవ మధ్యాహ్నం 12 గంటలకు, పరకామణి సేవ మధ్యాహ్నం 1 గంటకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నామని, భక్తులు వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరారు.

### నీరు- చెట్టు పెండింగ్ నిధులు విడుదల

అమరావతి,నీరు- చెట్టు పెండింగ్ నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నీరు- చెట్టు పెండింగ్ బిల్లులపై మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్ సీఎంను కలిశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నీరు-చెట్టు బిల్లుల విడుదలపై ఈ సందర్భంగా సీఎం కీలక నిర్ణయం తీసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న బి ల్లులకు దశల వారీగా నిధులు విడుదల చేయాలని ఆర్థికశాఖను ఆదశించారు.

# నియంత పాలనలో మగ్గిన తెలంగాణ

హైదరాబాద్,గడిచిన పదేళ్లు నియంత పాలనలో తెలంగాణ మగ్గిపోయిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ అస్థిత్వం అంటే.. కుటుంబ పాలన కాదన్న రేవంత్ రెడ్డి, తెలంగాణలో పాలన బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. కాలు కదపకుండా ఇంట్లో సేదదీరడానికి తాను ఫాంహౌస్ సీఎంను కాదు.. పనిచేసే ముఖ్యమంత్రిని అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఐక్యత, సమైక్యతను దెబ్బతీసేందుకు కొంతమంది ప్రయత్నం చేస్తున్నారని విరుచుకుపడ్డారు. లోతైన ఆలోచన చేసి సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా జరపాలని నిర్వహించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందులో రాజకీయం లేదని, ఇందులో రాజకీయ ప్రయోజన కోణంలో సెప్టెంబర్ 17ను చూడటం అవివేకమవుతుందని తెలిపారు. ఇక తన ఢిల్లీ పర్యటనపై విమర్శలు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. తన స్వార్థం కోసమో, వ్యక్తిగత పనుల కోసమో ఢిల్లీ వెళ్లడం లేదని తెలిపారు. తెలంగాణ హక్కుల సాధన కోసం ఎన్నిసార్లయినా ఢిల్లీ వెళ్తానని రేవంత్ ప్రకటించారు. ఢిల్లీ భారతదేశంలోనే ఉందని, మరో దేశంలో లేదన్నారు. కేంద్రం నుంచి రావలసిన ప్రతి పైసా తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉంటానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించిన ప్రజాపాలనదిన వేడుకల్లో సీఎం రేవంత్ పాల్గొన్నారు. అక్షరవీరులు ఒకవైపు, సాయుధ యోధులు మరో వైపు సాగించిన పోరాటంలో 76 ఏళ్ల క్రితం హైదరాబాద్ రాజ్యం స్వేచ్ఛ పొందిందని సీఎం రేవంత్ గుర్తు చేసుకున్నారు. ఒక ప్రాంతానికో.. ఒక కులానికో, ఒక మతానికో వ్యతిరేకంగా జరిగిన పోరాటం కాదన్న సీఎం.. సెప్టెంబర్ 17 ను కొంతమంది వివాదాస్పదం చేస్తున్నారన్నారు. లేక్‌సిటీగా ఉన్న హైదరాబాద్ ఫ్లడ్ సిటీగా దిగజారడానికి గత పాలకుల నిర్లక్ష్యమే కారణమని సీఎం రేవంత్ ఆరోపించారు. కేరళలాంటి దుస్థితి హైదరాబాద్‌కు రాకుండా చూసేందుకు హైడ్రా ఏర్పాటు చేశామని ప్రకటించారు. హైడ్రా ఒక పవిత్ర కార్యమని, ఇందులో ఎటువంటి స్వార్థమూ లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్ భవిష్యత్‌కు హైడ్రా గ్యారెంటీ ఇస్తుందని, ఇది తన భరోసా అని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో 'ప్రజాపాలన' దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహిస్తున్నారు. తొలుత సీఎం రేవంత్ రెడ్డి గన్ పార్క్ వద్ద అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం పబ్లిక్ గార్డెన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆ తర్వాత 'ఓ నిజాము పిశాచమా... కానరాడు నిన్నుబోలిన రాజు మాకెన్నడేని..' అన్న దాశరథీ కవితతో తన ప్రసంగం ప్రారంభించారు. తెలంగాణ అంటేనే త్యాగం, బలిదానం అని.. రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు పోరాడారని అన్నారు. '4 కోట్ల తెలంగాణ ప్రజలకు ప్రజాపాలన దినోత్సవం శుభాకాంక్షలు. నిజాం నిరంకుశ రాజును, ఆనాటి రాచరిక వ్యవస్థను మట్టి కరిపించి తెలంగాణ బానిస సంకెళ్లు తెంచిన చారిత్రాత్మక ఘట్టం 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ గడ్డపై ఆవిష్కృతమైంది. ఇది ప్రాంతానికో, ఒక కులానికో, ఒక మతానికో వ్యతిరేకంగా జరిగిన పోరాటం కాదు. ఒక జాతి తన స్వేచ్ఛ కోసం, ఆత్మగౌరవం కోసం రాచరిక పోకడపై చేసిన తిరుగుబాటు. నాటి సాయుధ పోరాటంలో ఎందరో ప్రాణ త్యాగాలు చేశారు. ఆనాటి పోరాటంలో ప్రాణాలు వదిలిన అమరవీరులకు ఈ సందర్భంగా ఘన నివాళి.' అని సీఎం పేర్కొన్నారు.


# బాలాపూర్ లడ్డూ మరో రికార్డు

హైదరాబాద్,బాలాపూర్ గణపతి లడ్డూ మరోసారి రికార్డు ధర పలికింది. ప్రతి సంవత్సరం కొత్త రికార్డులు సృష్టించుకొని బాలాపూర్ గణేష్ లడ్డూ పైపైకి వెళ్తోంది. ఈసారి కూడా అందరి అంచనాలకు తగ్గట్టుగానే పోటాపోటీగా వేలం సాగింది. కొత్తగా తీసుకొచ్చిన రూల్ ప్రకారం ముందుగా గతేడాది లడ్డూ అమ్ముడుపోయిన ధర డబ్బులు డిపాజిట్ చేస్తేనే ఈసారి వేలంలో పాల్గొనే అవకాశం ఇచ్చారు. అందుకే చాలా తక్కువ మంది ఈ డబ్బులు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొన్నారు. గతేడాది 27 లక్షలకు లడ్డూ వేలంలో అమ్ముడుపోయింది. దీంతో ఆ 27 లక్షలు డిపాజిట్ చేసిన కొద్ది మంది మాత్రమే ఈ వేలంలో పాల్గొన్నారు. గతేడాది ఆక్షన్‌లో పాల్గొన్న దయానందరెడ్డి కూడా ఈసారి 27 లక్షలు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. పోటీలో ఉన్నది తక్కువ మంది అయినప్పటికీ పోటీ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. పోటీలో ఉన్న కొద్దిమంది లడ్డూ కోసం హోరాహోరీగా తలపడ్డారు. చివరకు 30 లక్షల ఒక వెయ్యి రూపాయలకు కొలను శంకర్‌రెడ్డి లడ్డూను సొంతం చేసుకున్నారు. గతేడాది ఈ లడ్డూను 27 లక్షల రూపాయలకు ఈయన దక్కించుకున్నారు. ఇసారి కూడా 27 లక్షలు డిపాజిట్ చేసి వేలంలో పోటీ పడి మరీ భారీ ధర చెల్లించి లడ్డూను ఇంటికి తీసుకెళ్లారు. గతేడాది లడ్డూ దక్కించుకున్న తర్వాత బాగా కలిసి వచ్చిందని అందుకే ఈసారి పోటీ పడి మరీ సొంత చేసుకున్నట్టు చెప్పుకొచ్చారు. బాలాపూర్ గణేశ్ లడ్డూ వేలంపాటలో ఈసారి రికార్డు స్థాయి ధర పలికింది. 30లక్షల 1000 రూపాయలకు కొలను శంకర్‌రెడ్డి దక్కించుకున్నారు. గత ఏడాది లడ్డూ రూ.27 లక్షలు పలికింది. స్థానికేతరుడైన దాసరి దయానంద్‌రెడ్డి లడ్డూను దక్కించుకున్నారు. వేలంపాట అనంతరం ఉదయం 11 గంటలకు బాలాపూర్ గణేశుడి శోభాయాత్ర ప్రారంభం అయ్యింది. లడ్డూను దక్కించుకున్న అనంతరం కొలను శంకర్‌రెడ్డి మాట్లాడారు. బాలాపూర్ లడ్డూ మా కుటుంబానికి దక్కడం ఇది తొమ్మిదో సారి. ఈ లడ్డూను ప్రధాని మోదీకి అంకితం చేస్తున్నానని పేర్కొన్నారు. 1994 నుంచి బాలాపూర్‌లో లడ్డూ వేలం పాట కొనసాగుతోంది. మొదట రూ.450తో ప్రారంభం కాగా.. 2016లో రూ.14.65 లక్షలు, 2017లో రూ.15.60లక్షలు, 2018లో రూ.16.60 లక్షలు, 2019లో 17.60 లక్షలు, 2021లో రూ.18.90 లక్షలు, 2022లో రూ.24.60 లక్షలు పలికింది. 2020లో కరోనా కారణంగా వేలం పాట రద్దు చేశారు. బాలాపూర్ ముఖ్య కూడలిలోని బొడ్రాయి వద్ద వేలం పాట నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

## వివేకా హత్య కేసునుకొలిక్కి తేండి

అమరావతి,మాజీ మంత్రి వైఎస్ వివేకానందా రెడ్డి హత్య కేసును సీఐడీచే విచారణ జరిపించాలని వివేకా కూతురు వైఎస్ సునీత ఏపీ సీఎం చంద్ర బాబును కోరారు.సునీత దంపతులు విజయవాడలో చంద్ర బాబును కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ వివేకా హత్య కేసు, వైసీపీ నేతల ప్రమేయం, పోలీసుల విచారణ తదితర అంశాలను ఆమె సీఎంకు వివరిం చారు. వివేకా హత్యకేసులో నిజాలు రాబట్టాలని కోరారు. వివేకా పీఏ కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు.. అప్పటి సీబీఐ ఎస్పీ రాంసింగ్‌తో పాటు తమపై అక్రమ కేసు పెట్టారని సీఎం దృష్టికి తెచ్చారు. కృష్ణారెడ్డి ఫిర్యాదులో నిజానిజాలపై విచారణ చేయించాలని కోరారు. రాంసింగ్‌పై కేసు వంటి అంశాలపై విచారణ చేయించాలని విజ్ఞప్తి చేశారు. సీఐడీ విచారణ ద్వారా వాస్తవాలు బయటకు తేవాలని కోరారు. సునీత విజ్ఞప్తిపై సీఎం సానుకూలంగా స్పందించారు. తనకు అన్ని విషయాలు తెలుసని.. విచారణ చేయిస్తానని హామీ ఇచ్చారు.

# మోడీ చలవతో పెరుగుతున్న ధరలు



న్యూఢిల్లీ,విపక్షాలు విమర్శిస్తున్నా...మోడీ తన పాతధోరణిలో...మూస ధోరణిలో ముందుకు సాగుతున్నారు. దేశంలో సామాన్యులు పడుతున్న కష్టాలకు కాలం చెల్లడం లేదు. తాజాగా వంటనూనెల ధరల పెరుగుదలతో సామాన్యుడి నడ్డి విరిగింది. ఒక్క రోజులోనే లీటర్‌కు 15 నుంచి 25 రూపాయలు పెరిగాయి. ఉల్లిపాయలు 65 రూపాయలకు కిలో చేరింది. పప్పుల ధరలు మాత్రం చెప్పనక్కరలేదు. ధరలు దిగి రావడం లేదు. రూపాయి అందకుండా పోతోంది. గతంలో పైసకు ఉన్న విలువ నేటి రూపాయికి లేదు. బాలాపూర్ లడ్డూ ధర పెరిగినట్లుగా రోజురోజుకు ధరలు తాండవం చేస్తున్నాయి. అన్నపూర్ణగా ఉన్న భారత్‌లో అన్ని రకాల పంటలు పండుతున్నా సామాన్యులకు మాత్రం సరుకులు అందడం లేదు. ధరలు దకకడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మోడీ తన జన్మదినం సందర్భాగా ఇలాంటి సమస్యలు సమీక్షించుకుని ఉంటే మంచి ప్రధానిగా రాణించేవారు. కానీ పొగడ్తలకు అలవాటు పడ్డ కారణంగా క్షేత్రస్థాయిలో ఏమి జరుగు తుందో తెలుసుకోలేక పోతున్నారు. ఉద్యోగ ఉపాధి రంగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బిజెపి నేతలు కూడా మోడీ భజనలో మునిగి పోయారు. సమస్యలు తెలుసుకోవడం...తెలుసుకున్న సమస్యలను ప్రధానికి వివరించడం అన్నది లేకుండా పోయింది. అంతెందుకు ఎపిలో కేంద్రమంత్రులుగా ఉన్న రామ్మోహన్ నాయుడు వంటి వారు రాష్ట్రానికి ఏం చేద్దామా అని ఆలోచించి, నిధులు విడుదల చేయించుకుని అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నారు. కానీ తెలంగాణలో ఉన్న ఇద్దరు కేంద్రమంత్రులు కిసన్ రెడ్డి, బండి సంజయ్‌లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిట్టిపోయడానికే సమయం తీసుకుంటున్నారు. సామాన్యులు సమస్యల్లో చిక్కుకుని ఏడుస్తుంటే..ఆదానీ, అంబానీ లాంటి వారు మాత్రం ఆస్తుల్లో ఎవరెస్ట్ అంత ఎత్తుకు చేరిపోతున్నారు. వారి ఆస్తులు అమాంతంగా పెరుగుతున్నాయి. ప్రభుత్వరంగ సంస్థలను వారికి అప్పగించే పని ఆగడం లేదు. వడ్డించే వాడు మనవాడైతే ఏ బంతిలో కూర్చుంటే ఏమిటి ? అన్న సామెత ఇప్పుడు మన దేశ కుబేరుల్లో ముందు వరసలో ఉన్న ఆదానీకి బాగా సరిపోతుంది. ఎందుకంటే ఆయన చేసే వ్యాపారం కన్నా.. పొందుతున్న సహకారం వల్లనే ఈ స్థాయికి చేరారని చెప్పడంలో ఎలాంటి సందేహం అవసరం లేదు. ఆసియా కుబేరుడు గౌతమ్ అదానీ సంపదలో మరో మెట్టు ఎక్కడంలో ఆయన వెనక ఎవరున్నారు..ఎవరు సహకారం అందిస్తున్నారో దేశంలోని సామాన్యులకు కూడా తెలుసు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మించుకున్న గంగవరం పోర్టు, నెల్లూరులోని పోర్టులు అన్నీ ఆదానీ పరం అయ్యాయి. గత జగన్ ప్రభుత్వం దగ్గరుండి వాటిని ఆదానీకి కట్టబెట్టారు. ఇదంతా మోడీ చలవ వల్లనే అని వేరుగా చెప్పనక్కరలేదు. గంగవరం పోర్టుకోసం భూములు ఇచ్చి త్యాగం చేసిన జాలర్లు ఆగమయ్యారు. గంగవరం పోర్టుతో పాటు విశాఖ ఉక్కును కూడా మోడీ ప్రభుత్వం అప్పనంగా కార్పోరేట్లకు కట్టబెట్టే ఆలోచన చేశారు. తాత్కాలికంగా ఈ ప్రక్రియ నిలిచిపోయినా... దీని రోణకు ఒక్క ప్రకటనా చేయడం లేదు. అలాగే విశాఖ స్టీల్ పటిష్టతకు, ఐరన్ ఓర్ కేటాయింపులకు చర్యలు తీసుకోవడం లేదు. ఇలా ప్రభుత్వ సంస్థలను అప్పనంగా కట్టబెడితే ఎవరైనా ఆదానికి మించి ఆదాయం సంపాదించగలరు. ప్రపంచ కుబేరుల జాబితాలో చేరగలరు. ఈ కారణంగానే ప్రపంచంలోని అత్యంత ధనవంతుల జాబితాలో ఆదానీ అమాంతంగా ఎగబాకారు. నిజానికి ప్రపంచంలో ఉన్న కుబేరులంతా కష్టపడి నీతిమంతంగా సంపాదించి, అందులో దేశం కోసం కొంత వెచ్చించి కుబేరులవుతున్నారు. కానీ ఆదానీ, అంబానీలాంటి వారు భారత ప్రజల శ్రమశక్తిని తమ ఖాతాల్లో వేసుకుంటూ కుబేరులవుతున్నారు. ఇలాంటి వారికి మన ప్రధాని మోడీ లాంటి వారి సహకారం పుష్కలంగా ఉండడం కూడా కలసి వస్తోంది. అత్యధిక సంపద వృద్ధి నమోదు చేసుకున్న ప్రపంచ కుబేరుల్లో అదానీ దే అగ్రస్థానం. అంతేకాదు, ఈ ఏడాది సంపదను మరింత పెంచుకోగలిగిన ప్రపంచ టాప్ టెన్ కుబేరుల్లో అదానీ, అంబానీలు భారతీయులే కావడం విశేషం. ఇకపోతే మోడీ ప్రధాని అయ్యాక ఈ ఇద్దరికి గతంలో ఎప్పుడూ లభించనంత ప్రోత్సాహం దక్కుతోంది. పెట్రోల్‌పై రూపాయి తగ్గించడానికి, గ్యాస్‌పై రూపాయి తగ్గించడానికి, జీఎస్టీ వడ్డింపులను కొంతయినా తగ్గించడనాకి ఏ మాత్రం సాహసించని మోడీ ఇలాంటి కుబేరుల కోసం మాత్రం ఎంతైనా చేయడానికి సిద్దంగా ఉన్నారు. కార్పోరేట్లకు ఇచ్చే తాయిలాల్లో ఒక్క శాతం కూడా వ్యవసాయరంగానికి ఖర్చు చేసినా పరిస్థితి మరోలా ఉండేది. ఉచితాలకు ఖర్చు కావడం లేదు. దీనిని ఎవరు కూడా చర్చించడం లేదు.. నిజానికి కార్పోరేట్లకు ఉచితాలు ఇవ్వడం, రుణాలు మాఫీ చేయడం, పన్నులు రద్దు చేయడం కూడా లంచంగానే భావించాలి. సామాన్యులకు చేయని సాయం కార్పోరేట్ గద్దలకు దోచిపెట్టడం ఎంతవరకు సమంజసం. గతంలో కాంగ్రెస్ పాలకులు అనుసరించిన కార్పోరేట్ అనుకూల విధానాలను మరింత వేగంగా అమలు జరుపుతున్న ప్రధాని నరేంద్ర మోడీ కారణంగా సామాన్యులు ఇక్కట్ల పాలవుతున్నారు. సంపదను దేశ అభివృద్ధికి వినియోగించి ఉంటే ప్రజలకు ఉచితాలు పంచాల్సిన అవసరంలేదు. అలాగే కార్పోరేట్లకు ఇచ్చే రాయితీలు అడ్డుకుంటే ధరలతో ప్రజలు భారం మోయాల్సిన అవసరం రాదు. ఉచితాలు అనుచితాలు, సంస్కరణలు, నూతన విధానాలతో నిమిత్తం లేకుండా పాలన సాగిస్తే భారత ఆర్థిక వ్యవస్థ బలపడేది. పెద్ద మొత్తాలను ప్రోత్సాహకాల పేరుతో కేంద్రం అప్పనంగా కార్పొరేట్ల కు అప్పగిస్తోంది. ఆ మొత్తం ఖజానాకు చేరివుంటే ప్రజల సంక్షేమానికి లేదా పెట్టుబడుల ద్వారా దేశ సంపదల వృద్ధికి తోడ్పడేది. తమ ప్రభుత్వం వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు ఇస్తున్న ప్రోత్సాహం అని గొప్పలు చెప్పుకొనేందుకు, ఇంతేసి మొత్తాలను ఇస్తున్నాం రండి అని విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా ప్రకటనలు చేసుకుంది. కొందరి సంపద పెరిగితే ఏడుపు ఎందుకని మరికొందరు ప్రశ్నిస్తున్నారు. సంపాదించటం చేతకాక అంటారు మరికొందరు. అయితే దేశంలో పేదల పరిస్థితి నానాటికీ దిగజారుతున్నది. కొనుగోలు శక్తి నశిస్తోంది. ధరల పెరుగుదలకు దారి తీసిన కారణాల్లో ప్రధానమైనదిగా చమురుపై సెస్‌ల పెంపుదల ఒకటి. జనానికి ఉపశమనం కలిగించటం కంటే జీఎస్టీల పేరుతో దండుకోవడం ఎంతవరకు సబబు. ప్రజాస్వామ్యం లో పాలకుల అవినీతి ప్రత్యక్షంగా అయినా పరోక్షంగా అయినా ఎండగట్టాల్సిందే. లేకుంటే దేశ ప్రజలు మూల్యం చెల్లించుకోక తప్పదు.

# పటేల్ కృషితోనే తెలంగాణకు విమోచనం



హైదరాబాద్, నియంతృత్వ నిజాం నుంచి ప్రజలకు విమోచన లభించిన రోజు ఇది అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. పరేడ్ గ్రౌండ్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పరేడ్ మైదానంలో జాతీయ జెండాను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆవిష్కరించారు. అమరజవాన్లు స్తూపం, సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడారు. నిజాంపై వేల మంది ప్రజలు వీరోచితంగా పోరాటం చేశారని కొనియాడారు. ప్రజల బలిదానాలు, త్యాగాల తరువాత తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. రజాకార్ల మెడలు వంచడంలో దివంగత మాజీ ఉప ప్రధాని వల్లభాయ్ పటేల్‌ది సాహసోపేత పాత్ర అని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. రజాకార్ల వారసత్వ పార్టీకి కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు కొమ్ముకాస్తున్నాయని దుయ్యబట్టారు. భర్కత్ పురలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి జాతీయ జెండా ఎగురవేశారు. హైదరాబాద్ విమోచనానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ విశేష కృషి చేశారని కేంద్రహోంమంత్రి అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా హైదరాబాద్‌కు మాత్రం వెంటనే రాలేదన్నారు. నిజాం, రజాకార్ల ఆగడాలకు.. ఆపరేషన్ పోలో ద్వారా పటేల్ ముగింపు పలికారనికొనియాడారు. పటేల్ పోలీస్ యాక్షన్‌తో నిజాం సైన్యం తలవంచిందన్నారు. పటేల్ చేపట్టిన ఆపరేషన్ పోలోతో నిజాం తలవంచారని..13 నెలల తర్వాత తెలంగాణకు స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. పటేల్ లేకపోతే హైదరాబాద్ విమోచనానికి మరింత సమయం పట్టేదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు విమోచన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నిజాం పాలన నుంచి విముక్తి లభించి 75 ఏళ్లు గడిచినా ఎవరూ విమోచన దినోత్సవ వేడుకలు జరపడానికి ముందుకు రాలేదని కేంద్రమంత్రి అన్నారు. ఇన్నాళ్లూ ఈ వేడుకలు నిర్వహించడానికి ఏ ప్రభుత్వమూ సాహసించలేదని పేర్కొన్నారు. విమోచన దినోత్సవం నిర్వహించేందుకు అన్ని పార్టీలు భయపడ్డాయని తెలిపారు. ఈ వేడుకలను వైభవంగా నిర్వహించాలని ప్రధాన మంత్రి మోదీ ప్రకటన చేసిన తర్వాతే మిగతా పార్టీలు నిద్రలో నుంచి మేల్కొన్నాయని వ్యాఖ్యానించారు. నిజాం, రజాకార్ల ఆగడాలకు ఆపరేషన్ పోలో ద్వారా సర్దార్ పటేల్ ముగింపు పలికారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేక పోరాటంలో ఎందరో ప్రాణాలు అర్పించారు. హైదరాబాద్ స్వాతంత్ర్యం కోసం ఎందరో సైనికులు ప్రాణాలు అర్పించారని తెలిపారు. రజాకార్లు గ్రామాల్లో హత్యలు, మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాం పాలనలో మహిళలపై లెక్కలేనన్ని ఆగడాలు జరిగాయన్నారు. జలియన్‌వాలాబాగ్ తరహా ఘటన గుండ్రాంపల్లిలో జరిగిందని.. ఆ ఘటనలో ఎంతో మంది నేలకొరిగారని పేర్కొన్నారు. తెలంగాణను పాలించిన పార్టీలన్నీ ఓటు బ్యాంకు కోసమే పనిచేశాయన్నారు. విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించలేదన్నారు. విమోచనోత్సవాలతో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ పరిసరాలు శోభాయ మానంగా మారాయి. పోలీసుల కవాతులు, వీవీఐపీల రాక, కళాకారుల నృత్యాలతో విమోచన వేడుకలు నభూతో నభవిష్యత్ అన్నట్లుగా సాగాయి. వేడుకల్లో కళాకారులు నృత్యాలతో అలరించారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా సంప్రదాయ వస్త్రాలంకరణలో ప్రదర్శనలు ఇచ్చారు. మూడు రాష్ట్రా కళారూపకాల ప్రదర్శనతో పరేడ్ గ్రౌండ్స్ పరిసరాలు మార్మోగాయి. డప్పుదరువులు, ఒగ్గు కథలతో కళాకారులు హోరెత్తించారు.

# బాలపూర్‌ను మించిన రిచ్‌మండ్ విల్లా

హైదరాబాద్, గణేష్ ఉత్సవాలు దేశవ్యాప్తంగా ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో వేడుకలు జరిగే తీరు మాత్రం చాలా ప్రత్యేకం ఇక్కడ విగ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం, లడ్డూ వేలం ఇలా ప్రతి ఒక్క ఘట్టానికి ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. అందుకే దేశవ్యాప్తంగా ఎన్నెన్ని విగ్రహాలు పెడుతున్నా... అందరి చూపు తెలుగు రాష్ట్రాల వైపు ఉంటుంది. వైవిధ్యమైన విగ్రహాలు ఏర్పాటులోనే కాకుండా లడ్డూ వేలం పాటలో కూడా సరికొత్త రికార్డులు సృష్టిస్తూ టాక్‌ఆఫ్‌ది కంట్రీగా నిలుస్తున్నాయి. అలాంటి వాటిలో టాప్ ప్లేస్‌లోనే నిలిచటింది కీర్తి రిచ్‌మండ్ విల్లాస్ గణేషుడు. హైదరాబాద్‌లోని బండ్లగూడ జాగీర్‌లో ఉంది కీర్తి రిచ్‌మండ్ విల్లా. అక్కడ ఏటా భారీ ధరకు లడ్డూ వేలం పాట నిర్వహిస్తుంటారు. ఇక్కడ ఉన్న వాళ్లంతా ధనవంతులు కావడంతో లడ్డూ వేలం కూడా ఆ స్థాయిలోనే ఉంటుంది. ఈ సంవత్సరం కూడా ఆ స్థాయికి ఏ మాత్రం తగ్గనట్టుగా వేలం పాట జరిగింది. రికార్డు ధరకు లడ్డూను పాడుకున్నారు భక్తులు. కోటి రూపాయలకు పైగానే వేలం పాడినట్లు సమాచారం.

## వినాయక నిమజ్జనంలో విషాదం

యాదాద్రి ,వినాయకుడి నిమజ్జనంలో విషాదం చోటు చేసుకుంది. చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ విషాదకరస సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జిబ్లక్ పల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ప్రవీణ్ అనే యువకుడు గణేషుడిని చెరువులో నిమజ్జనం చేస్తుండగా ప్రమాదవశాత్తు చెరువులో జారి పడి మృతి చెందాడు. ప్రవీణ్ మృతదేహం వెలికి తీసేందుకు చర్యలు ప్రారంభించారు.

# చరిత్ర సృష్టించిన సిఎం రేవంత్

హైదరాబాద్, వినాయక నిమజ్జనోత్సవంలో పాల్గొన్న తొలి సిఎంగా సిఎం రేవంత్ రెడ్డి చరిత్ర సృష్టించారు. పబ్లిక్ గార్డెన్స్‌లో జెండా ఆవిష్కరణ అనంతరం నేరుగా ఆయన నెక్లెస్ రోడ్డుకు చేరారు. ట్యాంక్ బండ్ పై నిమజ్జనం క్రేన్స్ వద్ద పరిస్థితులను పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. జీహెచ్ఎంసీ కార్మికురాలిని పలకరించి సమస్యలు తెలుసుకున్నారు. క్రేన్ డ్రైవర్స్, ఇతర సిబ్బంది అప్పుడప్పుడు విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. మూడు షిఫ్టుల్లో డ్రైవర్స్ ,ఇతర సిబ్బందికి విధులు కేటాయించేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారుకు సూచించారు. నిమజ్జనం పక్రియ ముగిసే వరకు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎప్పటికపుడు పరిస్థితులను అంచనా వేస్తూ అలెర్ట్ గా ఉండాలని పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ గణేశ్ నిమజ్జనాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. సిఎం వెంట మేయర్ విజయలక్ష్మి, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ , ఎమ్మెల్యే దానం నాగేందర్ డిజిపి , కమిషనర్, జిహెచ్ఎంసి కమిషన్ ఆమ్రపాలి తదితరులు ఉన్నారు. మరోవైపు భాగ్యనగరంలో గణేష్ నిమజ్జనం అశేష భక్తజనం మధ్య కోలాహలంగా సాగింది. మంగళవారం మధ్యాహ్నం ఖైరతాబాద్ మహాగణపతి వేలాది మంది భక్తుల జయ జయ ధ్వానాల మధ్య గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. వేలాది విగ్రహాలు నిమజ్జనానికి తరలివచ్చాయి. ఈ క్రమంలో హుస్సేన్ సాగర్ పరిసరాలు భక్తజన సంద్రంగా మారాయి. విపరీతమైన రద్దీతో ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ గేట్లను సిబ్బంది మూసేశారు. పది నిమిషాలకోసారి గేట్లు తెరిచి ప్రయాణికులను లోపలికి అనుమతించేలా చర్యలు చేపట్టారు. దీనిపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటు, ఖైరతాబాద్ మెట్రో స్టేషన్‌తో పాటు బస్టాప్స్ సైతం కిక్కిరిసిపోయాయి. 70 అడుగుల ఖైరతాబాద్ గణేశుని భారీ విగ్రహ నిమజ్జనాన్ని కనులారా వీక్షించేందుకు వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఈ పరిస్థితి నెలకొంది. ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ మార్గ్, తెలుగు తల్లి ఫ్లైవర్, సచివాలయం, ఐమాక్స్ మార్గాలు జనసంద్రంగా మారాయి. ఈ క్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. దాదాపు 25 వేల మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు విధుల్లో నిమగ్నమయ్యారు.

# గణేశ్ నిమజ్జన ఉత్సవాల్లో దత్తాత్రేయ

హైదరాబాద్,భాగ్యనగరంలో గణేష్ శోభాయాత్ర ఘనంగా జరుగుతోంది. నిమజ్జన శోభాయాత్రను చూడటానికి భక్తులు భారీగా తరలి వస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ట్రాఫిక్ జాం నెలకొంది. మంగళవారం నిమజ్జనం జరుగుతుండటంతో తెలంగాణ ప్రభుత్వం భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసింది. హుస్సేన్ సాగర్ వరకు ఈ శోభాయాత్ర సాగనుంది. ఈ యాత్రలో హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో బండారు దత్తాత్రేయ మాట్లాడారు. హిందూ సమాజాన్ని విచ్ఛిన్నం చేయాలనే శక్తులకు సరైన బుద్ధి చెప్పాలని బండారు దత్తాత్రేయ హెచ్చరించారు. ఈరోజు అనంత చతుర్దశి.. మరోవైపు తెలంగాణ విమోచన దినోత్సవం. 1948 అనంత చతుర్దశి రోజు హైదరాబాద్‌కు విమోచనం లభించింది. నిజం కబంధహస్తాల నుంచి విమోచనం జరిగింది. తెలంగాణ విమోచనం జరిగిన రోజు కూడా ఇదే ఆనందం ప్రజల్లో ఉంది. ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం. మోదీ భారత దేశాన్ని మరింత ముందుకు నడిపే శక్తిని ఆ భగవంతుడు ఇవ్వాలి. విశ్వకర్మ జయంతి ఇదే రోజు. చాలా మంచి రోజు. సమాజంలో అందరినీ సమైక్యంగా కలుపుకునేవే గణేష్ ఉత్సవాలు. కులం, మతం, భాషా. ప్రాంతం అనే తేడా చూడకుండా మనమంతా ఒక్కటే అనే భావన ఉంటుందని బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్నా వేలాదిమందిని చూస్తుంటే ఆనందంగా ఉంది. మహిళలు, పిల్లలు భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతున్నారు. భాగ్యనగరంలో గణేష్ నిమజ్జనం కార్యక్రమం చాలా వైభవంగా జరుగుతోంది. మన సంస్కృతి సంప్రదాయాల్లో మహిళలను గౌరవిస్తాం. రాష్ట్ర ప్రభుత్వ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నాయి. నేను హర్యానా గవర్నర్‌నే కాదు.. అంతకు ముందు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యకర్తను. 1981 నుంచి నేను ఈ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యక్రమాల్లో పాల్గొంటున్నానని బండారు దత్తాత్రేయ వెల్లడించారు.

# ఖైరతాబాద్ మెట్రోకు ప్రయాణికుల తాకిడి

హైదరాబాద్,భాగ్యనగరంలో వినాయక నిమజ్జనం కార్యక్రమం కనుల పండువగా సాగుతోంది. వేలాది విగ్రహాలు వడి వడిగా గంగమ్మ ఒడికి చేరేందుకు వస్తున్నాయి. నగరం నలుమూలల నుంచి వినాయక విగ్రహాని హుస్సేన్ సాగర్ తీరానికి చేరుతుండటంతో ఆయా రూట్లలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. ఆర్టీసీ బస్సులను, మెట్రో ట్రైన్‌ను ఆశ్రయిస్తున్నారు. ముఖ్యంగా ఖైరతాబాద్ పరిసరాల్లో జనం తాకిడీ అధికంగా ఉంది. హుస్సేన్ సాగర్‌లో వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ప్రజలు తిరుగుప్రయాణంలో మెట్రో ట్రైన్‌ను ఆశ్రయిస్తున్నారు. అయితే, దీంతో ఖైరతాబాద్ మెట్రో స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ విపరీతంగా ఉంది. ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండటంతో మెట్రో అధికారులు ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ గేట్లు మూసివేశారు. మొత్తంగా తెరిచి ఉంచకుండా.. 10 నిమిషాలకు ఒకసారి ఎంట్రీ వద్ద గేట్లు తెరిచి ప్రయాణికులను లోపలికి పంపిస్తున్నారు. ఈ విధానంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బస్ సర్వీసులు కూడా ఫుల్ అవుతున్నాయి. బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి.ల్గ÷రతాబాద్ పరిసరాల్లో ఇసుకేస్తే రాలనంత జనం ఉన్నారు. మహాగణపతి నిమజ్జనం సహా, గణనాథుల నిమజ్జనాన్ని కనులారా వీక్షించేందుకు ట్యాంక్ పరిసరాలకు భక్తులు భారీగా చేరుకున్నారు. దీంతో ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, సచివాలయం, ఐమాక్స్ రూట్, తెలుగుతల్లి పరిసరాలు జనాలతో కిక్కిరిసిపోయాయి. మరోవైపు.. ప్రజల రద్దీ దృష్ట్యా పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు.

## రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా రాణి కుముదిని

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాణి కుముదిని నియమితులయ్యారు. ప్రస్తుత కమిషనర్ పార్థసారధి పదవీకాలం ఈ నెల ఎనిమిదో తేదీతో ముగియడంతో ఆయన స్థానంలో రాణి కుముదిని నియమిస్తూ గవర్నర్ జిష్టుదేవ్ వర్మ ఆదేశాలు జారీ చేశారు.

# స్టీల్‌ప్లాంట్ పంచాయతీ.. మీ స్టాండ్ ఏంటి?



అమరావతి,ఏపీలో మరోసారి స్టీల్ ప్లాంట్‌పై రచ్చ మొదలైంది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వార్తలు గుప్పుమన్నాయి. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన మద్దతు ఇచ్చాయన్న ప్రచారం జరుగుతోంది. అందులో ఎంత వరకు నిజముందో కాని.. వైసీపీ ఇప్పుడు దాన్నే అస్త్రంగా మార్చుకుని కూటమి ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తుంది. అధికారంలో ఉన్నప్పుడు ప్రైవేటీకరణపై కేంద్రాన్ని ప్రశ్నించలేకపోయిన వైసీపీ నేతలు ఇప్పుడు కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలని నిలదీస్తున్నారు. దానికి కూటమి నేతలు గట్టిగానే కౌంటర్ ఇస్తున్నారు. దాంతో మళ్లీ స్టీల్‌ప్లాంట్ ఇష్యూ ఫోకస్ అవుతోంది.భారతదేశపు మొట్టమొదటి తీరప్రాంత ఉక్కు కర్మాగారం విశాఖపట్నంలో ఏర్పాటైంది. వైజాగ్‌లో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయకూడదని 1966లో అప్పటి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం తెలుగు ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతకు కారణమైంది. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ వేలాది మంది విద్యార్థులు, కార్మికులు, సామాన్యులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు దిగారు. పోలీసు కాల్పుల్లో మైనర్‌తో సహా 12 మంది నిరాయుధులు మరణించడంతో నిరసనలు హింసాత్మకంగా మారాయి. వైజాగ్ స్టీల్ ప్లాంట్ డిమాండ్‌కు మద్దతుగా 66 మంది ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎంపీలు రాజీనామాలు కూడా చేశారు. దీంతో కేంద్రం దిగిరావడంతో 1970లో విశాఖపట్నంలో ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు.ఏపీలో ఇప్పుడు మరోసారి స్టీల్ ప్లాంట్‌పై రచ్చ మొదలైంది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వార్తలు గుప్పుమన్నాయి. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన మద్దతు ఇచ్చాయని ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి 2021లోనే వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. దానిపై అప్పటి నుంచి స్టీల్ ప్లాంట్ కార్మికులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాలు వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. వారి ఆందోళనలకు అప్పట్లో టీడీపీ, జనసేనలతో పాటు అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతిచ్చాయి.గత ఎన్నికల ప్రచారంలో కూడా టీడీపీ, జనసేనలు స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని ప్రకటించాయి. విశాఖలో వేల కుటుంబాలు స్టీల్‌ప్లాంట్ మీద ఆధారపడి జీవిస్తున్నాయి. వారి మద్దతుతో విశాఖ నగరంలో అన్ని స్థానాలను కూటమి కైవసం చేసుకుంది. ప్రైవేటీకరణ ఆగుతుందన్న నమ్మకంతో స్టీల్ ప్లాంట్ ఉన్న గాజువాకలో టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావును భారీ మెజార్టీతో గెలిపించారు ఓటర్లు. ఆఖరికి విశాఖ నార్త్‌లో బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు కూడా పట్టం కట్టారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేంద్రంతో రహస్య స్నేహం కొనసాగించినప్పటికీ.. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గట్టిగా నోరెత్తలేకపోయిందన్న విమర్శలున్నాయి.ఇక ఇప్పుడు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో విశాఖ ప్రైవేటీకరణ ఆగుతుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఎందుకంటే ఇప్పుడు బీజేపీకి టీడీపీ అతిపెద్ద మిత్రపక్షం. టీడీపీ, జనసేనలు కేంద్రంలో కీలకంగా ఉండటంతో ప్రైవేటీకరణ జరగకుండా కేంద్రాన్నిఒప్పిస్తారన్న నమ్మకం రాష్ట్ర ప్రజల్లో వ్యక్తమవుతుంది. ఇంకోవైపు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగడం ఏనాడో ఫిక్స్ అయ్యిందని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఇక ఇటీవల కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉ పసంహరణకు కేంద్రం అనుసరిస్తున్న పాలసీనే వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు వర్తిస్తుందని చెప్పి గందరగోళానికి తెర తీసారు.ఇటు వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయంలో టీడీపీ ఎలాంటి యూ-టర్న్ తీసుకోలేదని మంత్రి నారా లోకేశ్ అంటున్నారు. తాజాగా అదే అస్త్రాన్ని ఎక్కుపెట్టిన వైసీపీ నేతలు కూటమి సర్కారుని నిలదీస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో కూటమి ప్రభుత్వ విధానమేంటో స్పష్టం చేయాలని మాజీ మంత్రి, శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేస్తున్నారు. స్టీల్ ప్లాంట్ కు వ్యతిరేకమా? కాదా? చెప్పాలని డిమాండ్ చేసిన ఆయన.. ప్రైవేటీకరణను ఆపాలని మాత్రం అడగటం లేదు. కూటమి, కూటమి అన్న పదాన్ని మాత్రం నొక్కినొక్కి పలుకుతున్నారు.అధికారంలో ఉన్నంత కాలం స్టీల్ ప్లాంట్‌పై మాట్లాడని బొత్స సత్తిబాబు సడన్‌గా సీన్‌లోకి రావడంతో .. ఆయనపై మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఒక రేంజ్‌లో ఫైర్ అయ్యారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణే మా విధానం, నినాదం' అని స్పష్టం చేశారు. వైసీపీ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని ఇలాగే చేస్తే వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ ఖాతా కూడా తెరవదని ఎద్దేవా చేశారు. పొద్దున్న లేచిన దగ్గర నుంచి వైసీపీ నాయకులు టీడీపీ పై బురదజల్లే పనిలోనే ఉంటున్నారని విమర్శించారు.వైసీపీ ప్రభుత్వ ఉన్నప్పుడు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం గంటా శ్రీనివాస్ రాజీనామా చేశారు. అయితే ఎక్కడ ఆయనకు మైలేజీ పెరుగుతుందో అని మూడు సంవత్సరాల వరకు దాన్ని ఆమోదించలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఓటు హక్కు రాకుండా అడ్డుకోవాలన్న దురుద్దేశంతో అప్పటికప్పుడు గంటా రాజీనామాను ఆమోదించి స్టీల్ ప్లాంట్ కార్మికుల్లో విలన్‌ని చేసింది. అలాంటి గంటా ప్రైవేటీకరణపై చేసిన వ్యాఖ్యలు స్టీల్ ప్లాంట్ కార్మికులకు భరోసా ఇస్తున్నట్టు కనిపిస్తున్నాయి.ఆక్రమంలో ఈ సున్నితమైన అంశంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ రియాక్షన్ ఎలా ఉంటుందనేది ఉత్కంఠ రేపుతోంది.

# వరద సాయంలో కేంద్రం గుండు సున్నా

హైదరాబాద్:వరదలు మిగిల్చిన నష్టం నుంచి తెలంగాణ రాష్ట్రం ఇప్పుడప్పుడే కోలుకునేలా కనిపించడం లేదు. కేంద్ర పెద్దలెవరూ సాయంపై నోరు మెదపడం లేదు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. అందులో ఇద్దరు మంత్రులు కూడా ఉన్నారు. కానీ, తెలంగాణకు ఒరిగిందేమీ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఎన్నికల సమయంలో బీజేపీ నేతలు కొట్టిన డైలాగులు ఎక్కడికి పోయాయో.. ఎవరికీ అర్థం కావడం లేదని చాలామంది రాజకీయ నాయకులు అంటున్నారు.కిషన్‌రెడ్డి అభయమేమైంది..అన్నింటికీ మించి తెలంగాణ ఎంపీలకు కేంద్ర మంత్రి పదవులు వచ్చాయి. ఇక వీరంతా వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించారు. వీరితో పాటు బీజేపీ ఎంపీల బృందాలు పర్యటించాయి. ఖమ్మం జిల్లాలో వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పర్యటించి.. రాకాసితండాలో వరద బాధితులను పరామర్శించారు. బాధితులకు అండగా కేంద్ర ప్రభుత్వం ఉంటుందని అభయమిచ్చారు.పంటపొలాల్లో ఇసుక మేటలు..ముందుగా.. పంట పొలాల్లో ఇసుక మేటను తొలగిస్తామని హామీ ఇచ్చారు. అందుకు తగిన ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతే ఇక్కడితో వారి పరామర్శలు, పర్యటనలు ఆగిపోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.. "వచ్చారు.. చూశారు.. వెళ్లారు." అనే కాన్సెప్ట్‌తోనే కేంద్ర మంత్రుల పర్యటన సాగిందనే విమర్శలు ఉన్నాయి. కనీసం వీరెవరూ కూడా కేంద్ర పెద్దలతో మాట్లాడి నిధులు రప్పించే ప్రయత్నాలు చేయడం లేదనే తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.ఆ హామీలు..

ఢిల్లీ దాకా వెళ్లలేదా?

వరదల కారణంగా తెలంగాణకు ?5,348 కోట్ల మేర నష్టం జరిగిందని సాక్షాత్తూ సీఎం రేవంత్ రెడ్డి ఓపెన్గా ప్రకటించారు. అంతేకాకాకుండా.. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో జరిగిన భేటీలో కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా ఆపదలో ఉన్న ప్రజలకు సాయం చేస్తామని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తెలంగాణకు హామీ ఇచ్చారు. కట్ చేస్తే.. ఫలితం మాత్రం శూన్యం.ఆయన హైదరాబాద్ నుంచి ఫ్లయిట్ ఎక్కి, అన్నీ ఇక్కడే మరిచిపోయారని, ఢిల్లీ వరకు తీసుకెళ్లలేదనే విమర్శలు పెరుగుతున్నాయి.

అక్కడి వారే ప్రజలా..



గతంలో కూడా తెలంగాణకు భారీ వరదలు వచ్చాయి. అప్పుడు హైదరాబాద్లో కురిసిన భారీ వర్షాలకు కేంద్రం నుంచి ఆశించిన సాయం అందలేదనే వాదనలు కూడా ఉన్నాయి. అదే గుజరాత్లో విపత్తు వంటివి తలెత్తితే మాత్రం పరిగెత్తుకుంటూ వెళ్లి, కోట్ల రూపాయలు కుమ్మరిస్తారనే సూటిపోటి మాటలు కూడా రాజకీయ నాయకుల నోటి నుంచి వస్తున్నాయి. "అక్కడి వారే ప్రజలు, ఇక్కడి వారు కారా?" అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ప్రస్తుతం వరదలకు తెలంగాణలో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం కలిగింది. ఎంతోమంది పేదలు నిరాశ్రయులయ్యారు. వారందరికీ పునరావాసం కల్పించాల్సి ఉంది. ఇవన్నీ జరగాలంటే కేంద్రం ఏదో మొక్కుబడి తంతుగా విదిలిస్తే సరిపోదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అట్లైతే ఊరుకోం..

పక్కనే ఉన్న మరో ఏపీకి ఎక్కువ నిధులిచ్చి, తెలంగాణకు తక్కువ ఇచ్చినా ఊరుకునేది లేదని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. ఇలా చేస్తే.. తెలంగాణ ప్రజల్లో బీజేపీపై వ్యతిరేకత మరింత పెరుగుతుందని, ఇది పార్టీకే తీరని నష్టమని సీనియర్ రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. అన్నింటికీ మించి గొప్ప విషయం ఏమిటంటే.. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రజాక్షేమం కోసం ఒక మెట్టు దిగి పార్టీలు వేరేనా ప్రజల కోసం పార్టీలకతీతంగా పనిచేద్దామని ముందడుగు వేయడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది.

# ఆ రెండుపనులు పూర్తి మీరే చేయండి



పుంగనూరు : పుంగనూరు ప్రాంత అభివృద్ధి కోసం గత ప్రభుత్వ హయాంలో నాంది పలికిన టయోటా కంపెనీ, వాటర్ గ్రిడ్ పనులను కావాలంటే క్రెడిట్ మీరే తీసుకుని అయినా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాధినేతలను కోరుతున్నానని రాజంపేట లోక్ సభ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి విజ్ఞప్తి చేసారు. ఈరోజు నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ%ౌ% వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎంతో వెనుకబడిన పుంగనూరు ప్రాంత అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా తాము ఎంతో చేసామన్నారు.అందులో భాగంగా ప్రఖ్యాత టయోటా కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ బస్సుల తయారీ సంస్థను తెచ్చామని, వారికి అన్ని మౌలిక వసతి సౌకర్యాలు కల్పించడంతో శంకుస్థాపన కూడా చేశారన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి వాటాలతో ప్రతి గ్రామానికి పైప్ లైన్ల ద్వారా తాగునీరు అందించే వాటర్ గ్రిడ్ పథకం అమలుకు సిద్ధం చేసామని గుర్తుచేశారు.వేలాది మందికి ఉపాధి కల్పించి, లక్షలాది మందికి దాహార్తి తీర్చే ఆ రెండు పనులను కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మీడియా ద్వారా కోరుతున్నానన్నారు. కావాలంటే ఆ పనులు మీరే చేసినట్టు చెప్పుకుని అయినా రాజకీయాలకు అతీతంగా పూర్తి చేయించడానికి ముఖ్యమంత్రిని ఒప్పించాలని కూటమి పార్టీల నాయకులను కోరుతున్నానని మిథున్ రెడ్డి బహిరంగ విజ్ఞప్తి చేశారు.

# బుల్డోజర్ జస్టిస్‌కు సుప్రీంకోర్టు బ్రేకులు..

న్యూఢిల్లీ: కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు దుందుడుకుగా బుల్డోజర్లతో కూల్చివేతలకు పాల్పడుతుండటాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఆక్రమణల తొలగింపు పేరుతో సాగిస్తున్న ఈ బుల్డోజర్ జస్టిస్‌ను వచ్చే నెల 1 వరకు ఆపాలని అన్ని రాష్ట్రాలను మంగళవారం ఆదేశించింది. నిందితుల ఆస్తులతో సహా ఎటువంటి ఆస్తినీ తన అనుమతి లేకుండా కూల్చవద్దని స్పష్టం చేసింది. చట్టవిరుద్ధంగా కనీసం ఒక ఇంటిని కూల్చివేయడమైనా అది రాజ్యాంగ ఆత్మ, లక్షణాలకు వ్యతిరేకమని స్పష్టంచేసింది. అయితే, రోడ్లు, ఫుట్‌పాత్‌లు, రైల్వే లైన్లు, చెరువులు వంటి బహిరంగ ప్రదేశాల్లోని అనధికారిక నిర్మాణాలకు ఈ ఆదేశాలు వర్తించబోవని తెలిపింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం ఈ ఆదేశాలను ఇచ్చింది. చాలా రాష్ట్రాల్లో ఇళ్లు, ఇతర భవనాలను చట్టవిరుద్ధంగా కూల్చేస్తున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలను జారీ చేసింది. మరోవైపు వీటిని ఆపితే ఆక్రమణల తొలగింపు ఆలస్యమవుతుందన్న ప్రభుత్వ వాదనను కోర్టు కొట్టివేసింది. 'వచ్చే విచారణ వరకు మీ చర్యలను ఆపాలని మేం కోరినంత మాత్రాన మిన్ను విరిగి మీద పడదు' అని కోర్టు వ్యాఖ్యానించింది.ఇదే అంశంపై ఈ నెల 2న జరిగిన విచారణలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలపై వచ్చిన స్పందనలను మంగళవారం ప్రస్తావించింది. దేశవ్యాప్తంగా అమలు చేయదగిన మార్గదర్శకాలను జారీ చేస్తామని ఈ నెల 2న చెప్పింది. దీనిపై స్పందిస్తూ వచ్చిన స్టేట్‌మెంట్లలో, బుల్డోజర్ కొనసాగుతుందని, స్టీరింగ్ ఎవరి చేతుల్లో ఉందనే దానిపై అది ఆధారపడుతుందని అన్నారని గుర్తు చేసింది. సొలిసిటర్ జనరల్ మెహతాను ఉద్దేశించి న్యాయమూర్తులు మాట్లాడుతూ, 'ఈ మార్గదర్శకాలను జారీ చేసిన తర్వాత, ఈ ప్రాక్టీస్‌ను ఘనత చాటుకోవడం, హీరోయిజంగా చూపే యత్నంపై మీ సహాయం కోరుతాం. దీనిని ఎలా ఆపాలో మీరు మాకు



సహాయపడుదురుగాని. అవసరమైతే, ఎన్నికల కమిషన్‌ను కూడా అడుగుతాం" అని చెప్పారు. ఆ సమయంలో పిటిషనర్ల తరఫున హాజరైన న్యాయవాది ఒకరు మాట్లాడుతూ, ఈ నెల 2న విచారణ సందర్భంగా ఆదేశాలను ఇచ్చినప్పటికీ, ఆ తర్వాత కూడా దేశంలో కూల్చివేతలు కొనసాగాయని చెప్పారు.

చట్టప్రకారమే కూల్చివేతలు: కేంద్రం

సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ, నిర్మాణాల కూల్చివేతలపై ఓ కథనాన్ని రూపొందిస్తున్నారని అన్నారు. ఓ మతానికి చెందిన వాడైనందువల్ల అతని ఇంటిని కూల్చేశారని ఆరోపిస్తున్న పిటిషన్ సుప్రీంకోర్టు ముందు ఉందన్నారు. చట్టాన్ని పాటించకుండా కూల్చివేసిన ఒక ఉదాహరణను కోర్ట్ దృష్టికి తీసుకురమ్మనండి అని అన్నారు. ప్రభావిత వ్యక్తులకు తమ నిర్మాణాలు చట్టవిరుద్ధమని, తమకు నోటీసులు వచ్చాయని తెలుసునని, అందుకే వారు కోర్టును ఆశ్రయించడం లేదని చెప్పారు. ఓ భావాన్ని రూపొందిస్తున్నారని మెహతా చేసిన వ్యాఖ్యలపై ధర్మాసనం స్పందిస్తూ, 'బయటి గలాభా మమ్మల్ని ప్రభావితం చేయజాలదని హామీ ఇస్తున్నాం' అని స్పష్టం చేసింది.

# పండుగల వేళ ప్రజలకు భారీ షాక్.. లీటరు పల్లీ నూనె 170!



హైదరాబాద్, కేంద్ర ప్రభుత్వం పండుగల వేళ ప్రజలకు భారీ షాక్ ఇచ్చింది. వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని 20 శాతం వరకు పెంచేసింది. దీంతో సన్‌ఫ్లవర్, సోయాబీన్, రిఫైన్డ్ పామాయిల్‌పై ఇంపోర్ట్ టాక్స్ 12.5 శాతం నుంచి 32.5 శాతానికి చేరింది. దేశంలో నూనె గింజల ధరలు క్షీణిస్తున్న నేపథ్యంలో రైతులను ఆదుకొనేందుకు ఈ నిర్ణ యం తీసుకున్నట్టు కేంద్రం ప్రకటించింది. అయితే, ఇంపోర్ట్ టాక్స్ పెంపుతో వంట నూనెల ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగా యి. మొత్తంగా ముడి నూనెలపై సుంకం 5.5 శాతం నుంచి 27.5 శాతానికి, రిఫైన్డ్ నూనెలపై సుంకం 13.75 శాతం నుంచి 35.75 శాతానికి పెరిగింది.

అన్ని నూనెలూ భారమే

కేంద్రం దిగుమతి సుంకాన్ని 20 శాతం పెంచడంతో అన్ని రకాల నూనెల ధరలు లీటర్‌పై ఒకసారిగా రూ.15-20 వరకు పెరిగాయి. పామాయిల్ ధర రూ.100 నుంచి రూ.115-120, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.115 నుంచి రూ.130-140, వేరుశనగ నూనె రూ.155 నుంచి రూ.165-170కు చేరింది. పూజలకు ఉపయోగించే నూనెలనూ రూ.110 నుంచి రూ.120-125కి పెంచి అమ్ముతున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు వ్యాపారులు బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్నారు. స్టాక్ లేదంటూ బోర్డులు పెట్టి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. మరికొందరు పాత స్టాక్‌ను కూడా అధిక ధరలకు అమ్ముతున్నారు. కేవలం రెండు రోజుల్లోనే లీటరు నూనె ధర రూ.20 పెరుగడంతో వినియోగదారుడు నోరెళ్లబెడుతున్నాడు. ప్రభుత్వం స్పందించి ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు.

గత నెలలో 16 శాతం తగ్గిన దిగుమతులు: ఎస్ఈఏ

దేశంలో 2023 ఆగస్టుతో పోలిస్తే గత నెలలో వంట నూనె దిగుమతులు 16 శాతం తగ్గినట్టు సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా

# అతిశి మార్లేనా సింగ్.. మరి అతిశిగా ఎందుకు మార్చుకున్నారు?

న్యూఢిల్లీ: ఢిల్లీకి మూడో మహిళా ముఖ్యమంత్రి కాబోతున్న అతిశి రాజకీయ ఎదుగుదల అత్యంత వేగంగా చోటుచేసుకున్నది. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన మనీశ్ సిసోడియాకు విద్యాశాఖ సలహాదారుగా ఉన్న అతిశి ఇప్పుడు రాష్ట్రానికే ముఖ్యమంత్రి కాబోతున్నారు. 43 ఏళ్ల వయసున్న అతిశి.. కేజ్రీవాల్ ప్రభుత్వంలో అత్యధిక శాఖలను నిర్వహించారు. గతంలో ఢిల్లీకి కాంగ్రెస్ తరఫున షీలా దీక్షిత్, అనంతరం బీజేపీ తరఫున సుష్మా స్వరాజ్ ముఖ్యమంత్రులుగా పనిచేశారు. వాస్తవానికి ఆమె తల్లిదండ్రులు ఆమెకు పెట్టిన పేరు అతిశి మార్లేన్ సింగ్. కానీ.. రాజకీయాల్లోకి వచ్చే ముందు ఆమె తన పేరును అతిశిగా మార్చుకున్నారు. దాని వెనుక ఆసక్తికర అంశాలు ఉన్నాయి.మరికొద్ది నెలల్లో ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో అతిశి పెద్ద ఎత్తునే బాధ్యతలు నిర్వహించాల్సి ఉన్నది. ఆరు నెలలుగా కేజ్రీవాల్ జైల్లో ఉండటంతో ప్రభుత్వ విధానపర నిర్ణయాలు మూలనపడ్డాయి. దీంతో నిరంతరం క్యాబినెట్ సమావేశాలు నిర్వహిస్తూ కీలక ప్రాజెక్టులకు ఆమోదం తెలుపుతూ ఢిల్లీ ప్రగతిని ముందుకు నడిపించాల్సి ఉన్నది. ప్రత్యేకించి ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన, ఎలక్ట్రిక్ వాహనాల 2.0 పాలసీ తదితరాలు కీలకంగా ఉన్నాయి. అతిశి.. ఆప్ వ్యవస్థాపక సభ్యురాలు. పార్టీ విధానాల రూపకల్పనలో ఆమె కీలక పాత్ర పోషించారు. 2013 మ్యానిఫెస్టో తయారీ కమిటీలో కీలక సభ్యురాలిగా ఉన్నారు.రాజకీయాల్లోకి రాక ముందు ఆమె మధ్యప్రదేశ్‌లోని ఒక గ్రామంలో ఆర్గానిక్ వ్యవసాయం, ప్రగతిశీల విద్యపై కేంద్రీకరించారు. కొంతకాలం ఏపీలోని రుషికొండలోని ఒక పాఠశాలలో చరిత్ర, ఇంగ్లిష్ బోధించారు. రాజకీయ నాయకురాలిగా ఆమె పరివర్తనలో ఇవి ప్రధాన భూమిక పోషించాయని పార్టీ నేత ఒకరు అన్నారు. 2013లోనే ఆప్‌లో చేరినా.. ఆమె రాష్ట్ర ప్రభుత్వ విద్యారంగ సలహాదారుగా పనిచేశారు. 2019లో తూర్పు ఢిల్లీ నుంచి బీజేపీ అభ్యర్థి గౌతం గంభీర్‌పై పో టీ చేయడం ద్వారా ఎన్నికల రాజకీయాల్లోకి వచ్చారు. అయితే.. ఆ ఎన్నికల్లో ఆమె ఓటమిపాలయ్యారు. 2020లో కల్కాజీ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. పార్టీ ముఖ్యనేతల్లో ఒకరైన మనీశ్ సిసోడియా అరెస్టయి, పార్టీ తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న సమయంలో ఆమెను కేజ్రీవాల్ రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ఇది ఆమెకు రాజకీయంగా ఎదిగేందుకు అవకాశం కల్పించింది. అనంతరం కేజ్రీవాల్ కూడా జైలుకు వెళ్లాల్సి రావడంతో దాదాపు ప్రభుత్వ బాధ్యతనంతా తానే మోయడమే కాదు.. ప్రత్యర్థి దాడుల నుంచి ప్రభుత్వాన్ని కాపాడుతూ వచ్చారు. ఢిల్లీ నీటి సంక్షోభం సమయం కావచ్చు.. పార్టీ రాజ్య సభ సభ్యురాలు స్వాతి మలివాల్ దాడి ఉదంతం కావచ్చు.. ఆమె రాజకీయ విమర్శలను గట్టిగా తిప్పికొట్టారు. ఢిల్లీ తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న సమయంలో హర్యానా నుంచి ఢిల్లీకి రావాల్సిన నీటి వాటా కోసం ఆమె నిరాహార దీక్షకు సైతం దిగారు. అతిశి ఢిల్లీ క్యాబినెట్‌లో కీలక మంత్రి మాత్రమే కాదు.. ఆప్ కీలక నేత కూడా.ఢిల్లీ విద్యారంగ



విప్లవంలో అతిశి కీలక భాగస్వామిగా ఉన్నారు. ఢిల్లీలోని ప్రభుత్వ విద్యాసంస్థల రూపురేఖలనే మార్చివేయడంలో, సమాచార హక్కు చట్టం కింద స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఏర్పాటులో తన వంతు పాత్ర పోషించారు. 2022లో ఐక్య రాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో మాట్లడిన అతిశి.. పట్టణ పరిపాలనలో ఢిల్లీ మోడల్‌ను అంతర్జాతీయ స్థాయిలో హైలైట్ చేశారు.ఆమె తల్లిదండ్రులు విజయ్ సింగ్, త్రిప్త వాహి.. ఢిల్లీ యూనివర్సిటీలో ప్రొఫెసర్లు. ఢిల్లీ యూనివర్సిటీ సెయింట్ స్టీఫెన్ కాలేజీలో చరిత్రలో బ్యాచిలర్ డిగ్రీ పొందిన అతిశి.. ఆ ఏడాది బ్యాచ్‌లో టాపర్‌గా నిలిచారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలంలో విద్య, చరిత్రలో ఆమె పీజీలు చేశారు.ఇక ఆమె పేరు మార్చుకోవడం వెనుక ఆసక్తికర కథే ఉన్నది. వాస్తవానికి ఆమె తల్లిదండ్రులు పెట్టిన పేరు అతిశి మార్లేనా సింగ్. అయితే.. మార్ లేనా అనేది.. కమ్యూనిస్టు సిద్ధాంత కర్తలు మార్క్స్, లెనిన్ పేర్లను తలపించేవిగా ఉంది. 2018 వరకూ మార్లేనా పేరు కొనసాగించుకున్నారు. కానీ.. తన పేరులో ఎలాంటి రాజకీయ ప్రస్తావనలు ఉండకూడదని భావించిన అతిశి.. అన్ని రికార్డుల్లో తన పేరును అతిశిగా అధికారికంగా మార్చుకున్నారు.

## సీఎం మనవడి సందడి

హైదరాబాద్,నగరంలో గణేశ్ నిమజ్జనం కోలాహలంగా సాగుతోంది. భక్తుల కోలాటాలు, భజనలు, బ్యాండ్ మేళాలతో అంగరంగ వైభవంగా నిమజ్జనాలు జరుగుతున్నాయి. దీనికి జీహెచ్ఎంసీ భారీ ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మనవడు చిందులు వేస్తున్న వీడియో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మనవడి డ్యాన్సుకు సీఎం ఫిదా అయ్యారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఈ ఏడాది రెండు అడుగుల నుంచి దాదాపు 70 అడుగుల వరకు విశేషంగా వివిధ మండపాల్లో గణనాథుడు భక్తులకు దర్శనమిచ్చాడు. ఇటు ఖైరతాబాద్ గణేశ్ నిమజ్జనానికి కూడా ఏర్పాట్లు భారీగా చేశారు. శోభా యాత్ర నిర్విఘ్నంగా కొనసాగుతోంది. గ్రేటర్‌లో ఈ ఏడాది లక్షా 40 వేల గణేశ్ విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే 40 వేల వినాయక విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. ఇవాళ లక్ష గణేశ్ విగ్రహాల నిమజ్జనం...

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com